1635 మంది తొలగింపు



- ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు
- సమ్మెలో నుంచి 952 మంది విధులకు హాజరు
- నేడు ఖాళీ అవుతున్న అంగన్వాడీ పోస్టులకు నోటిఫికేషన్


ఖాళీ అవుతున్న అంగన్వాడీ పోస్టులకు రోస్టర్ పాయింట్ల ప్రక్రియలో మదనపల్లె ఐసీడీఎస్ అధికారులు

మదనపల్లె టౌన్, జనవరి 22: రాష్ట్ర వ్యాప్తంగా 42 రోజుల పాటు అంగన్వాడీలు నిర్వహించిన సమ్మెపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. ఎస్మా చట్టాన్ని ప్రయోగించి షోకాజ్ నోటీసులు జారీ చేసి, ఉద్యోగాల్లో నుంచి తొలగించే ప్రక్రియను ప్రభుత్వం వేగంగా పెంచింది. జిల్లాలో సోమవారం 1635 మంది అంగన్వాడీ వర్కర్లు, ఆయాలను విధుల నుంచి తొలగిస్తూ వారికి టెర్మినేషన్ ఆర్డర్స్ జారీ చేసినట్లు ఐసీడీఎస్ అధికారులు తెలిపారు. జిల్లాలోని 11 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 2275 అంగన్వాడీ సెంటర్లు ఉండగా వీటిలో 2207 మంది అంగన్వాడీలు, 1795 మంది హెల్పర్లు పనిచేస్తున్నారు. ఈ క్రమంలో తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం అంగన్వాడీలు నవంబరు 21వ తేదీ ప్రభుత్వానికి సమ్మె నోటీసులు ఇచ్చారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో డిసెంబరు 12వ తేదీ నుంచి అంగన్వాడీలు జిల్లా వ్యాప్తంగా నిరవధిక సమ్మెలోకి వెళ్లిపోయారు. ఆయా ప్రాజెక్టుల పరిధిలో ప్రతిరోజూ వినూత్నంగా నిరసనలు తెలుపుతూ సమ్మె చేశారు. కానీ ప్రభుత్వం తలొగ్గక అంగన్వాడీ సర్వీసు అత్యవసర సర్వీసుల కింద చేరుస్తూ ఎస్మా చట్టం ప్రయోగిస్తూ జీవో నెంబరు 2 జారీ చేసింది. ఈ క్రమంలో జనవరి 10వ తేదీ సమ్మెలో ఉన్న అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. పది రోజుల్లో సరైన సమాధానం లేకుంటే అంగన్వాడీలను ఉద్యోగాల నుంచి తొలగిస్తామని నోటీసుల సారాంశం. దీనిపై ఈనెల 18వ తేదీ నిరవధిక సమ్మెలో ఉన్న అంగన్వాడీలు షోకాజ్ నోటీసులకు మూకుమ్మడిగా సమాధానాలు పంపారు.

దీనిపై సంతృప్తి చెందని ప్రభుత్వం వేగంగా పావులు కదిపింది. ఈనెల 22వ తేదీ ఉదయం 10 గంటల లోపు సమ్మె విరమించి విధుల్లో చేరని అంగన్వాడీలను ఉద్యోగాల్లో నుంచి శాశ్వతంగా తొలగిస్తామని హెచ్చరికలు చేసింది.

952 మంది విధులకు హాజరు

జిల్లా వ్యాప్తంగా 4002 మంది అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు ఉండగా వీరిలో 2207 మంది అంగన్వాడీ వర్కర్లు, 1795 మంది హెల్పర్లు ఉన్నారు. వీరిలో 909 మంది సమ్మెలోకి వెళ్లకుండా విధులకు హాజరవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 14 మంది మెడికల్ లీవులో ఉన్నారు. 1687 మంది వర్కర్లు, 1406 మంది హెల్పర్లు కలిపి మొత్తం 3093 మంది 42 రోజుల పాటు విధులకు హాజరు కాకుండా నిరవధిక సమ్మెలో పాల్గొన్నారు. ఈ క్రమంలో షోకాజ్ నోటీసులకు సరైన సమాధానం చెప్పలేదని, ఈనెల 22వ తేదీ సోమవారం ఉదయం 10 గంటల లోపు విధుల్లోకి రాని వారిని ఉద్యోగాల్లో నుంచి తొలగిస్తామని ప్రభుత్వం కలెక్టర్ల ద్వారా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల లోపు 545 మంది అంగన్వాడీ వర్కర్లు, 407 మంది అంగన్వాడీ హెల్పర్లు విధుల్లో జాయిన్ అయ్యారు. వీరు పనిచేస్తున్న అంగన్వాడీ సెంటర్లకు వెళ్లి అక్కడ విధుల్లో ఉన్న ఎంఎస్కేల నుంచి అంగన్వాడీ సెంటర్లలోని పౌష్టికాహారం, గుడ్లు, తదితర వస్తువులను స్వాధీనం చేసుకుంటూ ఫొటోలు దిగి అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. దీంతో విధుల్లో చేరిన అంగన్వాడీలు అధికారులు చెప్పినట్లు చేశారు. కాగా విధులకు హాజరు కాకుండా సమ్మెలోనే కొనసాగుతున్న వర్కర్లు, హెల్పర్లను 1635 మందిని టెర్మినేట్ చేస్తూ ఆర్డర్స్ జారీ చేశారు. దీంతో జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్ల ఎంపిక కమిటీ (ఆర్డీవోలు, ఐసీడీఎస్ పీడీ, సీడీపీవో, డిప్యూటీ డీఎంహెచ్‌వో) నుంచి సీడీపీవోల ద్వారా సమ్మెలో ఉన్న అంగన్వాడీలకు టెర్మినేషన్ ఉత్తర్వులు రిజిస్టర్ పోస్టుతో పాటు, నేరుగా వారి ఇంటి వద్దకు వెళ్లి సూపర్‌వైజర్లు అతికించనున్నారు.

నేడు అంగన్వాడీ పోస్టులకు నోటిఫికేషన్

జిల్లా వ్యాప్తంగా సమ్మెలో ఉన్న వర్కర్లు, హెల్పర్లను ఉద్యోగాల నుంచి తొలగింపుతో ఖాళీగా ఉన్న పోస్టులకు మంగళవారం భర్తీ నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. ఈ మేరకు సోమవారం అంతా అన్ని ప్రాజెక్టుల పరిధిలో ఖాళీ అవుతున్న వర్కర్, హెల్పర్ పోస్టులకు ఆయా ప్రాంతాల వారీగా కుల గణన ఆధారంగా రోస్టర్ పాయింట్లు తయారు చేశారు. దీని ప్రకారం మంగళవారం వెలువడబోయే నోటిఫికేషన్ల తరువాత, ఆయా పోస్టులకు నేరుగా, లేదా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విధంగా ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడనున్నట్లు తెలుస్తోంది. అలాగే ఈనెల 26వ తేదీ ఖాళీ అయిన పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించే విధంగా చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది.

టెర్మినేషన్ పేరుతో భయపెడుతున్నారు..

ఈనెల 18వ తేదీ లోపు విధుల్లోకి రాకుంటే టెర్మినేషన్ చేస్తామని భయపెట్టారు. అయినా అంగన్వాడీలు సమ్మె విరమించలేదు. చలో విజయవాడ వెళ్లకుండా అడ్డుకున్నారు. ఒకవేళ ఏ అధికారి నుంచి టెర్మినేషన్ ఉత్తర్వులు వస్తాయో చూసి ఆపై సీఐటీయూ, అంగన్వాడీ అసోసియేషన్ నిర్ణయం తీసుకుంటాము.



- మధురవాణి, సీఐటీయూ జిల్లా నాయకురాలు

ముగ్గురాళ్ల గనుల్లో అవినీతిపై నిగ్గు తేల్చాలి

- టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని



ముగ్గురాళ్ల గనుల బోర్డును చూపిస్తున్న పంతగాని

రైల్వేకోడూరు, జనవరి 22: మంగంపేట ముగ్గురాళ్ల గనుల్లో జరిగిన అవినీతిపై సీబీఐ నిగ్గు తేల్చాలని టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మంగంపేట బెరైటీస్‌ను పరిశీలించి అనంతరం మీడియాతో మాట్లాడారు. మంగంపేట ముగ్గురాళ్ల గనులు ప్రపంచంలోనే ప్రసిద్ధి గాంచాయన్నారు. మంగంపేట బెరైటీస్‌లో రూ.650కోట్లు గోల్‌మాల్ జరిగిందన్నారు. దీనిపై సీబీఐ చేత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. గతంలో మంగంపేట బెరైటీస్‌లో అక్రమాలు జరుగుతున్నాయని తెలిపినా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. ఉద్యోగ నియామకాల నుంచి బెరైటీస్ వరకు అక్రమాలు జరుగుతున్నాయన్నారు. మంగంపేట ముగ్గురాళ్లలో ఏ-గ్రేడును సీ-గ్రేడు అని అక్రమంగా తరలించారన్నారు. గతంలో అక్రమాలు బయటపడిన తర్వాత కొందరు ఉద్యోగులను బాధ్యులను చేస్తూ పక్కన పెట్టారన్నారు. ఏదో ఒక సాకుతో విచారణను బయటకు రానివ్వకుండా చేస్తున్నారన్నారు. మంగంపేటలో వడ్డించేవాడే అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. మంగంపేటలో ఇంత స్థాయిలో అక్రమాలు జరుగుతున్నా ప్రభుత్వం ఎందుకు విచారణ వేగవంతం చేయలేదని ప్రశ్నించారు. ఇప్పటికే ఇక్కడ జరుగుతున్న అక్రమాలను టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. వెంటనే మంగంపేట గనుల్లో జరుగుతున్న అక్రమాలను విచారణ చేసి అధికారులు, ఇందుకు బరి తెగించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టీడీపీ అధికారంలోకి రాగానే గనుల్లో జరిగిన అక్రమాలపై ఉన్నత స్థాయి అధికారి చేత విచారణ చేయించి నిగ్గు తేల్చుతామని తెలిపారు.

గణతంత్ర వేడుకలను విజయవంతం చేయాలి

- కేటాయించిన విధులను బాధ్యతగా పూర్తి చేయాలి : జేసీ


సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్, అడిషనల్ ఎస్పీ

రాయచోటి (కలెక్టరేట్), జనవరి 22: స్థానిక పెరేడ్ మైదానంలో ఈనెల 26వ తేదీ జరిగే భారత గణతంత్ర వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించి విజయవంతం చేయాలని జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో గణతంత్ర వేడుకల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు బాధ్యతాయుతంగా కృషి చేయాలని, వారికి కేటాయించిన విధులు సమన్వయంతో పక్కాగా నిర్వహించి విజయవంతం చేయాలన్నారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబిస్తూ వివిధ శాఖలు ఏర్పాటు చేసే శకటాల ప్రదర్శన ఆకర్షణీయంగా అందరినీ ఆకట్టుకునేలా ఉండాలని, అలాగే ఆయా శాఖలు ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను కూడా ఏర్పాటు చేయాలన్నారు. పోలీస్ పెరేడ్ మైదానంలో షామియానాలు, కుర్చీలు, బారికేడ్ల ఏర్పాట్లు పర్యవేక్షించాలని ఆర్డీవో, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌లను ఆదేశించారు. రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి వచ్చే విద్యార్థులకు స్నాక్స్, వాటర్ బాటిల్స్ ఇవ్వాలన్నారు. అడిషనల్ ఎస్పీ రాజ్‌కమల్ మాట్లాడుతూ జిల్లా యంత్రాంగంతో పూర్తిగా సమన్వయం చేసుకుని పెరేడ్ మైదానంలో పోలీసుశాఖ తరపున చేయాల్సిన ముందస్తు ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేసి వేడుకల విజయవంతానికి కృషి చేస్తామన్నారు. అధికారులందరూ ఒకరోజు ముందుగా పెరేడ్ మైదానాన్ని సందర్శించి చేయాల్సిన ఏర్పాట్లపై తగు సలహాలు, సూచనలు అందించాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్వో సత్యనారాయణ, ఆర్డీవో రంగస్వామి, ఎస్డీసీ శ్రీలేఖ, తదితరులు పాల్గొన్నారు.



ఓటర్లు పెరిగారు..



- తుది జాబితా విడుదల
- జిల్లా మొత్తం ఓటర్లు 14,02,808
- పురుషులు 6,89,346.. స్త్రీలు 7,13,326, ఇతరులు136
- ముసాయిదా తర్వాత పెరిగిన ఓటర్లు 45,906
- తప్పులు లేకుండా.. జాబితా వెలువడేనా?

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో జిల్లా అధికారులు సోమవారం జిల్లా ఓటర్ల తుది జాబితాను విడుదల చేశారు. ముసాయిదా ఓటర్ల జాబితా కంటే ప్రస్తుతం ఓటర్లు పెరిగారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాలకు గానూ మొత్తం ఓటర్లు 14,02,808 ఉన్నారు. 2023 అక్టోబరులో ఓటరు ముసాయిదా జాబితాలో జిల్లాలోని ఓటర్లు 13,58,165 మంది ఉన్నారు. తుది జాబితా నాటికి జిల్లా వ్యాప్తంగా 45,906 మంది ఓటర్లు పెరిగారు. తుది జాబితా ప్రకారం పురుషులు 6,89,346, స్త్రీలు 7,13,326, ఇతరులు 136 మంది ఉన్నారు. ముసాయిదా జాబితాలో అనేక ఫిర్యాదులు వచ్చాయి. ఒకరి పేరునే రెండు, మూడు ఓట్లు, చనిపోయిన వాళ్ల ఓట్లు జాబితాలో వచ్చాయి. ఒకే డోరు నెంబరుతో పెద్ద సంఖ్యలో, జీరో డోరు నెంబరుతో వేల సంఖ్యలో ఓట్లు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రతిపక్షాలు రాష్ట్ర, కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేశాయి. డబుల్ ఎంట్రీ ఓటర్లు, చనిపోయిన ఓటర్లు తొలగింపు కోసం ఎన్నికల సంఘం ఆదేశాలతో అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ నేపథ్యంలో తుది ఓటరు జాబితాలో తప్పులు లేకుండా ఉండేనా.? అని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన ఓట్లు

తుది ఓటరు జాబితా ప్రకారం తంబళ్లపల్లె నియోజకవర్గంలో పురుషులు 1,09,219, స్త్రీలు 1,12,418 మంది ఇతరులు 10 మంది కలిపి మొత్తం ఓటర్లు 2,21,647 మంది ఉన్నారు. మదనపల్లె నియోజకవర్గంలో 1,27,324 మంది పురుషులు, 1,32,329 మంది స్త్రీలు, 57 మంది ఇతరులు కలిపి 2,59,780 మంది ఓటర్లు ఉన్నారు. పీలేరు నియోజకవర్గంలో 1,14,022 మంది పురుషులు, 1,18,397 మంది స్త్రీలు, 16 మంది ఇతరులు కలిపి 2,32,435 మంది ఉన్నారు. రాయచోటి నియోజకవర్గంలో 1,23,836 మంది పురుషులు, 1,26,512 మంది స్త్రీలు, 26 మంది ఇతరులు కలిపి 2,50,374 మంది ఓటర్లు ఉన్నారు. రాజంపేట నియోజకవర్గంలో 1,15,594 మంది పురుషులు, 1,21,424 మంది స్త్రీలు, 10 మంది ఇతరులు కలిపి 2,37,028 మంది ఓటర్లు ఉన్నారు. రైల్వేకోడూరులో 99,531 మంది పురుషులు, 1,02,176 మంది స్త్రీలు, 17 మంది ఇతరులు కలిపి 2,01,544 మంది ఓటర్లు ఉన్నారు. గత ఏడాది అక్టోబరు 27న ముసాయిదా ఓటరు జాబితాను అధికారులు విడుదల చేశారు. అప్పట్లో జిల్లావ్యాప్తంగా 13,58,165 మంది ఓటర్లు ఉన్నారు. 2019 ఎన్నికలతో పోల్చితే ముసాయిదా జాబితా విడుదల నాటికి జిల్లాలో 42,041 ఓట్లు పెరిగాయి. ఇందులో పురుషులు 16,471, మహిళలు 25,570 ఉన్నారు. అయితే ముసాయిదా జాబితా మొత్తం తప్పుల తడకగా ఉందనే చెప్పవచ్చు. ఒకరికే రెండు, మూడు ఓటర్లు ఉండడం, చనిపోయిన వాళ్ల పేర్లు ఓటరు జాబితాలో ఉండడం వంటి అనేక ఫిర్యాదులు వచ్చాయి. దీనిపైన ప్రధాన ప్రతిపక్షం తెలుగుదేశం పార్టీ ఆధారాలతో సహా రాష్ట్ర, కేంద్ర ఎన్నికల సంఘాలకు ఫిర్యాదులు చేసింది. దీంతో డబుల్ ఎంట్రీ ఓటర్లకు నోటీసులు పంపించారు. ఎక్కడో ఒక చోటే ఓటు ఉంచుకోవాలని నోటీసులో పేర్కొన్నారు. అదే సమయంలో కొత్తగా ఓటు నమోదు కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు దీంతో కొత్తగా ఓటర్ల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. అయితే డబుల్ ఎంట్రీ ఓటర్ల విషయంలో ఫిర్యాదులో పేర్కొన్న ప్రకారం పూర్తిగా తొలగిపోయే అవకాశం లేదని పలువురు పేర్కొంటున్నారు. ఇంకా రెండు చోట్ల ఓటు కలిగి ఉన్న వ్యక్తులు పలువురికి ఇంకా అధికారుల నోటీసులు అందలేదు. దీంతో తుది జాబితాలో డబుల్ ఎంట్రీలు ఇంకా ఉండే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. అదే సమయంలో చనిపోయిన వాళ్లను ఓటరు జాబితాలో కొనసాగించడం కూడా పూర్తి స్థాయిలో ప్రక్షాళన జరిగి ఉండకపోవచ్చని పలువురు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో తుది జాబితా కూడా తప్పుల తడకగా ఉండే అవకాశం ఉంది. అయితే సాధారణ ఎన్నికలకు గడువు సమీపిస్తుండటంతో తుది జాబితా కూడా తప్పుల తడకగా ఉంటే అధికారులు ఏం చేస్తారో వేచి చూడాలి.


పీలేరులో వైభవంగా జరిగిన శోభాయాత్ర


వాల్మీకిపురంలో జరుగుతున్న శోభాయాత్ర


గుర్రంకొండలో సీతారామ, హనుమాన్ వేషధారణలో చిన్నారులు

ఊరూ.. వాడా.. జైశ్రీరామ్..

- శ్రీరామ జపంతో మార్మోగిన జిల్లా
- పలుచోట్ల అన్నదానాలు.. ప్రత్యేక పూజలు
- కోలాహలంగా శోభాయాత్రలు
- పెద్ద సంఖ్యలో జనం హాజరు

రాయచోటి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో బాలరాముడు ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా సోమవారం జిల్లా వ్యాప్తంగా ఊరూ..వాడా..జైశ్రీరామ్ అంటూ శ్రీరాముని పేరు మార్మోగిపోయింది. అయోధ్యలో జరిగిన కార్యక్రమాన్ని పలుచోట్ల వీధుల్లో పెద్ద పెద్ద స్క్రీన్‌లు ఏర్పాటు చేసి ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఏ పల్లెలో చూసినా పండుగ వాతావరణ కనిపించింది. రామాలయాల్లో ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించారు. పలుచోట్ల పెద్దఎత్తున అన్నదానాలు చేశారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల ఆధ్వర్యంలో పలు పట్టణాల్లో శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. రాయచోటి పట్టణంలోని కొత్తపేట రామాలయంలో పెద్ద ఎత్తున భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామాలయంలో పానకం, వడపప్పు భక్తులకు పంచిపెట్టారు. కొత్తపేట రామాపురంలో రామాలయం, ప్రభుత్వ హైస్కూల్ వద్ద పెద్ద పెద్ద స్క్రీన్‌లను ఏర్పాటు చేసి అయోధ్యలో జరిగిన బాలరాముడు ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు. అనంతరం సుగవాసి ప్రసాద్‌బాబు చేతుల మీదుగా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమానికి సుమారు 2 వేల మంది హాజరయ్యారు. చిన్నమండెం మండలం కేంద్రంలో రామాలయంలో అన్నదానం నిర్వహించారు. గాలివీడు పట్టణంలో భారీగా ప్రజలు హాజరై శోభాయాత్రను నిర్వహించారు. తంబళ్లపల్లె మండల కేంద్రంలో జై శ్రీరామ్ నినాదాలు ఇస్తూ.. బైకు ర్యాలీ నిర్వహించారు. బి.కొత్తకోటలో ర్యాలీ నిర్వహించి. అనంతరం అన్నదానం నిర్వహించారు. మదనపల్లె పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఊరువాడ అంతా రాములోరి విగ్రహప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని దేవళంవీధిలో ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయం ముందు బీజేపీ జిల్లా కార్యదర్శి యల్లంవల్లె ప్రశాంత్ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం అత్యంతవైభవంగా నిర్వహించారు. పీలేరు పట్టణంలో శ్రీరాముని రథ శోభాయాత్ర కన్నులపండువగా జరిగింది. సీతా, లక్ష్మణ, ఆంజనేయ స్వామి సమేతంగా అందంగా అలంకృతమైన రథంపై ఆశీనుడైన శ్రీరామచంద్రుడిని 'జై శ్రీరాం' నినాదాల మధ్య పట్టణ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. యాత్రలో అధిక సంఖ్యలో పాల్గొన్న మహిళలు, చిన్నారులు స్వామి వారి రథాన్ని స్వయంగా లాగారు. వాల్మీకిపురం క్షేత్రం శ్రీరామ నామ స్మరణలతో మార్మోగిపోయింది. భారీగా శ్రీరామ భక్తులు స్కూటర్ ర్యాలీ చేపట్టి జై శ్రీరామ్ నామస్మరణలతో హోరెత్తించారు. గుర్రంకొండలో ప్రతి ఆలయంలో ఉదయాన్నే స్వామి వారికి అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం స్వామి వారిని గ్రామంలో ఊరేగించారు. ఊరేగింపులో సీతారామ, హనుమాన్ వేషధారణలతో చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ములకలచెరువు మండలంలో సోమవారం రామనామంతో ఆలయాలు మార్మోగాయి. ములకలచెరువు, గూడుపల్లె, వేపూరికోట, బురకాయలకోట, దేవళచెరువు, మద్దినాయనిపల్లె, సోంపల్లె తదితర గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ములకలచెరువులోని శ్రీ శారదా పాఠశాల విద్యార్థులు జైశ్రీరామ్ ఆకారంలో కూర్చోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే రాజంపేట, రైల్వేకోడూరు, కలికిరితో పాటు జిల్లావ్యాప్తంగా అన్నిచోట్లా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.


ములకలచెరువులో జైశ్రీరామ్ ఆకారంలో విద్యార్థులు


గాలివీడులో రాములోరి శోభాయాత్ర

జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణత పెంచాలి

- ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ సౌరబ్ గౌర్



సమావేశంలో మాట్లాడుతున్న ఇంటర్మీడియట్ విద్యా కమిషనర్ సౌరబ్‌గౌర్

రాయచోటిటౌన్, జనవరి 22: గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులు చదువుతున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణతా శాతం పెంచాలని ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ సౌరబ్‌గౌర్ తెలిపారు. సోమవారం ఆయన రాయచోటికి వచ్చిన సందర్భంగా స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో అధ్యాపకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై శ్రద్ధ పెట్టి వారిని మరింత ముందుకు తీసుకెళ్లాలన్నారు. త్వరలో జరగనున్న ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలను, మార్చిలో జరిగే పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. కళాశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం వహించినా, అధ్యాపకులు విధుల్లో నిర్లక్ష్యం వహించినా శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇంటర్మీడియట్ విద్య ఆర్జేడీ రవి, కృష్ణయ్య తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుంటే కఠిన చర్యలు

అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అధికారి కుముదిని

కురబలకోట, జనవరి 22: అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా భవన నిర్మాణాలు చేపడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అధికారి కుముదిని తెలిపారు. సోమవారం మండలంలోని అంగళ్లులో లేఅవుట్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. లేఅవుట్‌లు, భవన నిర్మాణాలను అన్ని అనుమతులు పొందిన తర్వాత చేపట్టాలని, అలా కాకుండా చేస్తే కూల్చేస్తామన్నారు. కార్యక్రమంలో పీకేఎం వైస్ చైర్మన్ బాబర్ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ, పోలీసు సిబ్బంది... సుహాసిని(ఫైల్)

ఒంటిమిట్ట, జనవరి 22: స్థానిక నడివీధి గంగమ్మ వీధిలో నివాసం ఉంటున్న సంకు సుహాసిని (42) అనే మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. స్థానిక పోలీసుల వివరాలు మేరకు.. భార్య భర్తలు ఇరువురు గత రాత్రి ఘర్షణ పడ్డారు. అనంతరం ఇరువురు ఇంటిలో నిద్రిస్తుండగా అర్ధరాత్రి సమయంలో భార్య ఇంటి నుంచి వెళ్లిపోయి కనిపించడం లేదని భర్త సుబ్బారావు ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ పురుషోత్తం రాజు, ఎస్ఐ మధుసూదన్‌రావు ఘటనా స్థలానికి చేరుకొని మహిళ మృతదేహాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులను విచారించారు. కాగా, మహిళ మృతి అనుమానాస్పదంగా ఉందని.. కుమారుడు మనోజ్ ఫిర్యాదు మేరకు విచారణ చేపడుతున్నామని సీఐ పురుషోత్తమరాజు తెలిపారు.మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించామని తెలిపారు. దీనిపై అనుమానాస్పద కింద కేసు నమోదు చేసి విచారిస్తున్నామని ఆయన తెలిపారు.

రైలులో నుంచి జారిపడి యువకుడు మృతి

కొండాపురం, జనవరి 22: మండలంలోని రేగడిపల్లె రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం తెల్లవారుజామున తిరుపతికి వెళుతున్న రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైలులో నుంచి జారిపడి మహారాష్ట్రకు చెందిన యువకుడు మృతి చెందాడు. లాతురుకు చెందిన సంజయ్ భీమ్‌రావ్ దేశ్‌ముఖ్(26) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు రైలులో నుంచి జారి పడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎర్రగుంట్ల రైల్వే ఎస్ఐ రారాజు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఆయన పేర్కొన్నారు.

వాహనాల తనిఖీల్లో రూ.23 లక్షల నగదు స్వాధీనం

ప్రొద్దుటూరు, జనవరి 22: పట్టణంలోని మైదుకూరు రోడ్డులో రిలయన్స్ పెట్రోల్ బంక్‌వద్ద వాహనాల తనిఖీల్లో రూ.23 లక్షల నగదును రూరల్ ఎస్ఐ శివప్రసాద్ ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం సాయంత్రం రూరల్ పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ప్రొద్దుటూరు నుంచి పులివెందులకు కారులో వెళుతున్న ముగ్గురు వ్యక్తుల వద్ద నుంచి రూ.23 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. ఈ నగదుకు ఎలాంటి బిల్లులు, రసీదులు లేకపోవడంతో పులివెందుల పట్టణానికి చెందిన రఘువీరారెడ్డి వద్ద నుంచి రూ.9.50లక్షలు, షేక్ ఇంతియాజ్ నుంచి రూ.7.50 లక్షలు, చింతకొమ్మదిన్నెకు చెందిన షేక్ అమీన్ నుంచి రూ.6 లక్షలు స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.. ఈ నగదును తిరుపతి ఐటి అధికారులకు పంపిస్తామని తెలిపారు.

ముచ్చుమర్రి వద్ద రూ. 9.7 లక్షలు..


సీజ్ చేసిన నగదును చూపుతున్న ట్రైనీ డీఎస్పీ శ్రీకాంత్, ఎస్ఐ యోగీంద్ర

కొండాపురం, జనవరి 22 : మండలంలోని ముచ్చుమర్రి పునరావాస కేంద్రం వద్ద సోమవారం సాయంత్రం పోలీసులు రూ.9,70,000 నగదు సీజ్ చేశారు. ట్రైనీ డీఎస్పీ శ్రీకాంత్, కొండాపురం ఎస్ఐ యోగేంద్ర ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ఈ నగదును స్వాధీనపరచుకున్నారు. నెల్లూరు జిల్లా మనుబోలు మండలం వీరంపల్లి గ్రామానికి చెందిన నరసింహులు అనంతపురం నుంచి నెల్లూరుకు కారులో ఈ మొత్తాన్ని తీసుకొస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. సరైన ఆధారాలు చూపకపోవడంతో నగదును సీజ్ చేసినట్లు డీఎస్పీ, ఎస్ఐలు తెలిపారు. నగదును ఐటీ అధికారులకు అప్పగించనున్నట్లు వారు పేర్కొన్నారు.

కె.సుగుమంచిపల్లె చెక్‌పోస్టు వద్ద ...

కొండాపురం మండలంలోని జిల్లా సరిహద్దుల్లోని కె.సుగుమంచిపల్లె చెక్‌పోస్టు వద్ద బుధవారం రాత్రి పోలీసులు రూ.3.15 లక్షల నగదు సీజ్ చేశారు. తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి నగదును స్వాధీనం చేసుకున్నారు. తాడిపత్రి నుంచి తాళ్లప్రొద్దుటూరుకు కారులో వెళుతున్న చెన్నా సూర్యనారాయణ అనే వ్యక్తి నుంచి ఈ మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. నగదుకు సరైన ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

30 తులాల బంగారు, ఏడున్నర లక్షలు...

బద్వేలు టౌన్, జనవరి 22: పట్టణంలోని పలు రహదారుల్లో సోమవారం రూరల్ పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈతనిఖీల్లో ఒక వాహనంలో 30 తులాల బంగారం, మరో వాహనంలో ఏడున్నర లక్షల నగదు గుర్తించారు. ఈ నగదు, బంగారానికి సంబంధించి ఎలాంటి బిల్లులు, పత్రాలు లేకపోవడంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఆటోను ఢీకొన్న కారు

● నలుగురు మహిళలకు గాయాలు

బద్వేలు రూరల్, జనవరి 22: మండల పరిధిలోని నక్కలగండి సమీపంలో ఆటోను కారు ఢీకొన్న ఘటనలో నలుగురు మహిళలు గాయపడ్డారు. వివరాలిలా.. బి.కోడూరు మండలం అక్కుపాలెం గ్రామానికి చెందిన వ్యవసాయ మహిళా కూలీలు బద్వేలు మండలం నక్కలగండి గ్రామ సమీపంలో పొలాల వద్దకు కూలీ పనులకు వెళుతున్నారు. ఈ క్రమంలో వెనుక వైపు నుంచి వస్తున్న కారు ఆటో వెనుక భాగంలో ఢీకొట్టడంతో హజరతమ్మ, సుభాన్‌బీ, గురమ్మ, రసూల్‌బీ అనే నలుగురు మహిళా కూలీలు గాయపడ్డారు. 108 వాహనంలో బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం హజరతమ్మ, రసూల్‌బీలను కడపకు తరలించారు. ఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

28 మద్యం బాటిళ్లు స్వాధీనం

కడప (క్రైం), జనవరి 22 : కడప నగరంలోని ఆర్టీసీ కాలనీ రోడ్డులో ఓల్డ్ బైపాస్ రోడ్డు వద్ద అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసి.. అతని వద్ద నుంచి 28 క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చిన్నచౌకు ఎస్ఐ పి.రవికుమార్ తెలిపారు. నిందితుడు స్వప్న బార్ అండ్ రెస్టారెంటు వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడన్నారు. ఆ మేరకు అతన్ని అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు

సికెదిన్నె, జనవరి 22: కడప-రాయచోటి జాతీయ రహదారిలోని గువ్వలచెరువు ఘాట్‌లో జరిగిన ప్రమాదంలో లారీ డ్రైవర్ గాయపడినట్లు అగ్నిమాపక అధికారి తెలిపారు. గువ్వలచెరువు ఘాట్ 4వ మలుపు వద్ద ఆగి ఉన్న ట్రాలీ లారీని వెనుకవైపు మరో కంటైనర్ ఢీకొనడంతో లారీ క్యాబిన్‌లో డ్రైవర్ కాళ్లు ఇరుక్కుపోయి తీవ్ర గాయాలయ్యాయి.

వెంటనే సమాచారం అందుకున్న కడప అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని హైడ్రాలిక్ కట్టర్ సహాయంతో సురక్షితంగా బయటకు తీసి అంబులెన్స్‌లో తరలించారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మెన్ అన్వర్‌బాష, సంజీవరాయుడు, డ్రైవర్ గంగాధర్‌యాదవ్, ఫైర్‌మెన్ మురళీకృష్ణ, రమేష్‌నాయుడులు పాల్గొన్నారు.

బద్వేలులో గంజాయి గ్యాంగులు

● విశాఖ, కడపల నుంచి సరుకు
● లక్షల్లో వ్యాపారం
● మత్తుకు బానిసలవుతున్న యువత

బద్వేలు, జనవరి 22: మత్తు పదార్థాల విక్రయాలను అరికట్టడంలో పోలీసులు తీసుకుంటున్న చర్యలు వీరి చేష్టల ముందు బలాదూర్ అవుతున్నాయి. గుట్కా, ఖైనీ, రాజా, గంజాయి లాంటి మత్తు పదార్థాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. బద్వేలు పట్టణంలో గ్యాంగులుగా ఏర్పడి గంజాయి విక్రయాలు సాగిస్తున్నట్లు సమాచారం. గంజాయి విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతుండడంతో వీటికి అలవాటుపడ్డ వారితో పాటు కొత్తగా యువత కూడా ఈ వ్యసనానికి బానిసలవుతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి చాలా రహస్యంగా తీసుకువచ్చి.. చిన్న చిన్న ప్యాకెట్లుగా మార్చి విక్రయాలు సాగిస్తున్నారు. వీటిని అరికట్టేందుకు అప్పుడపుడు దాడులు జరుగుతున్నా ఇవేవి గంజాయి గ్యాంగుల ముందు పనిచేయడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

విశాఖ, కడప నుంచి....?:

పట్టణంలో విక్రయిస్తున్న గంజాయిని విశాఖపట్టణం అలాగే కడప నగరం నుంచి తీసుకువస్తున్నట్లు తెలుస్తోంది. ఎక్కువ మొత్తంలో కొందరు విశాఖ పట్నం నుంచి తెస్తుండగా కొందరు కడప నుంచి తీసుకువస్తున్నట్లు సమాచారం. కడపలోని మోచంపేట ప్రాంతం నుంచి తీసుకువస్తున్నట్లు తెలుస్తోంది. గంజాయిని చిన్న చేతి సంచులు, ప్యాంటు జేబులలో తీసుకువచ్చి వారికి అవసరమైన చోట విక్రయించడం జరుగుతుంది. అలాగే కొన్ని ప్రాంతాలలో స్థావరాలు ఏర్పాటు చేసుకుని అక్కడ రహస్యంగా విక్రయిస్తున్నట్లు చెప్పుకొంటున్నారు. ఖాళీ సిగిరెట్ ప్యాకెట్లలో గంజాయిని నింపి ఒక్కో ప్యాకెట్ రూ.300 వరకు విక్రయిస్తున్నారని తెలుస్తోంది. గంజాయిని పీల్చేవారు కూడా సిగిరెట్లలోని పొగాకు తొలగించి వాటిలో గంజాయిని నింపుకుని తాగుతూ ఉంటారు. ఇలా పీల్చే వారిలో యువత ఎక్కువగా ఉన్నారు.

మత్తులో ఘర్షణలకు దిగుతున్న యువత

పట్టణంలోని మార్కెట్‌యార్డు మహమ్మద్ కాలనీ, పోరుమామిళ్ల బైపాస్ రోడ్డు, చాంద్ థియేటర్ వెనుక ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు స్థానికుల ద్వారా అందిన సమాచారం. గంజాయికి బానిసలైన వారు ఈ ప్రదేశాల్లో గుంపులుగా ఏర్పడి తాగడం, అల్లర్లకు పాల్పడడం వంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. గంజాయి విక్రయించే గ్యాంగులు పట్టణంలో 10 నుంచి 15 వరకు ఉన్నట్లు సమాచారం. గంజాయికి, మద్యానికి బానిసైన యువకులు ఆ మత్తులో ఘర్షణలకు దిగి హత్యల వరకు వెళ్తున్నట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరి బద్వేలు పట్టణంలో గంజాయి విక్రయాలు అరికట్టేందుకు పోలీసు అధికారులు ఏ మేరకు స్పందిస్తారో వేచి చూడాలి.



గంజాయి, అక్రమ మద్యం విక్రయిస్తే చర్యలు

పట్టణంలో గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు మా దృష్టికి రాలేదు. గంజాయి, బెల్టుషాపుల ద్వారా అక్రమంగా మద్యం విక్రయించిన వారిపై ప్రత్యేక దృష్టి సారించాం. గంజాయి విక్రయించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఎవరైనా గంజాయి విక్రయించినట్లు మా దృష్టికి తెస్తే వారి పేర్లను గోప్యంగా ఉంచుతాం

-వెంకట మురళి, బద్వేలు ఎక్సైజ్ సీఐ

రామనామ స్మరణతో మార్మోగిన కోదండరామాలయం

ఒంటిమిట్ట, జనవరి 22: కోదండరామాలయం భక్తుల రామనామస్మరణతో మార్మోగింది. అయోధ్యలో బాలరాముని ప్రాణప్రతిష్ఠ పురస్కరించుకొని కోదండరామాలయానికి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. ఉదయం నుంచి భక్తులతో రామాలయంలో సందడి వాతావరణం నెలకొంది. భక్తులకు ప్రసాదాలను పెద్దఎత్తున అందజేశారు. జిల్లా నలుమూలల నుండి ద్విచక్ర వాహనాలలో ర్యాలీగా కోదండరామాలయానికి భక్తులు చేరుకున్నారు. కడప నుంచి అడ్వకేట్లు బృందం రామనామ స్మరణతో ర్యాలీగా ఒంటిమిట్ట చేరుకొని చేరుకొని కోదండరామున్ని దర్శించుకున్నారు.


కోదండరామున్ని దర్శించుకునేందుకు క్యూలైన్‌లో ఉన్న భక్తులు

దర్శనం కోసం తోపులాట

కోదండరామున్ని దర్శించుకునేందుకు పెద్దఎత్తున భక్తులు రావడం... టీటీడీ ముందస్తు చర్యలు చేపట్టకపోవడంతో భక్తులు మధ్య పెద్ద ఎత్తున తోపులాట చోటు చేసుకుంది. ఒక దశలో టీటీడీ విజిలెన్స్ సిబ్బందికి భక్తులను అదుపు చేయడం వీలు కాకపోవడంతో కొద్దిసేపు ఒకరిపై ఒకరు పడ్డారు. కొంత మంది మహిళలు కింద పడటంతో దర్శనం చేసుకోకుండానే వెనుతిరిగారు. భక్తులకు టీటీడీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కాగా, అయోధ్యలో జరుగుతున్న రామ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని కోదండ రామాలయంలో ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేశారు. బీజేపీ రాష్ట్ర నేత రమేష్‌నాయుడు భక్తులతో కలిసి రామనామస్మరణలో పాల్గొన్నారు.

స్పందన అర్జీలను వెంటనే పరిష్కరించాలి : కలెక్టర్

కడప(కలెక్టరేట్) జనవరి 22: వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ స్పందనలో బాధితులు ఇచ్చే అర్జీలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ విజయరామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ స్పందన కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తమ విన్నపాలను కలెక్టర్, అధికారులకు విన్నవించారు. వారిసమస్యలు విన్న తరువాత కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారులను పదే పదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దన్నారు. అర్జీలు పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారాలు ఉండాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, అధికారులు యధుభూషణ్ రెడ్డి, ఆనంద్ నాయక్, ప్రత్యూష, తదితర అధికారులు పాల్గొన్నారు.


ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయరామరాజు

ప్రజల సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించాలి

రాయచోటి (కలెక్టరేట్), జనవరి 22: జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో అందిన ప్రజల సమస్యలను అత్యధిక ప్రాధాన్యతతో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో జేసీతో పాటు డీఆర్వో సత్యనారాయణ, ఎస్డీసీ శ్రీలేఖలు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. నిర్ణీత గడువులోపు అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను నాణ్యతగా పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులను బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెనింగ్ లేకుండా పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు.

ఖైదీలను మంచి పౌరులుగా తీర్చి దిద్దుతున్నారు

● జైలు సిబ్బంది పనితీరు భేష్
● వైవీయూ వీసీ ప్రొఫెసరు చింతా సుధాకర్

కడప (క్రైం), జనవరి 22 : ఖైదీల ఆలోచనా విధానం మార్చి మంచి పౌరులుగా తీర్చిదిద్దడంలో జైలు సిబ్బంది పనితీరు అభినందనీయమని యోగివేమన విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ చింతా సుధాకర్ కొనియాడారు. కడప కేంద్ర కారాగారంలో రిట్రీట్ 2024 కార్యక్రమం ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జైళ్ల శాఖ అధికారులు ఖైదీలనందరినీ రక్షిస్తూ వారిని సంస్కరిస్తున్నారని.. ఖైదీల సంస్కరణ ద్వారా సమాజాన్ని మారుస్తున్నారన్నారు. మంచి సమాజంతోనే దేశాభివృద్ధి జరుగుతుందని అన్నారు. ఖైదీల శిక్షను కూడా శిక్షణగా మార్చి వారిలో పెనుమార్పు తెస్తున్నారన్నారు. అనంతరం డిప్యూటీ ఇన్‌స్పెక్టరు జనరల్ ఆఫ్ ప్రిజన్స్ ప్రొసీడింగ్ ఆఫీసరు రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ 8 జిల్లాల్లో ఉన్న కారాగార సిబ్బందికి సదరు రీట్రీట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిబ్బంది జైళ్లశాఖ అభివృద్ధికి కావాలసిన విషయాలను రీట్రీట్‌లో చర్చించి తగు సలహాలు, సూచనలు ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ జైలు పర్యవేక్షణ అధికారి ప్రకాశ్, ఉపపర్యవేక్షణాధికారి సాంబశివరావు, జైలు సిబ్బంది పాల్గొన్నారు. ముందుగా జైల్లోని స్టీలు ఫ్యాక్టరీ, సబ్బుల ఫ్యాక్టరీ, బ్రిక్స్ ఫ్యాక్టరీలను ప్రొఫెసరు చింతా సుధాకర్ పరిశీలించారు.



మాట్లాడుతున్న వైవీయూ వీసీ చింతా సుధాకర్

టీడీపీ నాయకులపై పోలీసుల అక్రమ కేసులు

● త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో ప్రవీణ్ బైఠాయింపు
● నిందితులైనా.. వైసీపీ వారిని అరెస్టు చేయరా
● సీఐలను నిలదీసిన ప్రవీణ్‌రెడ్డి

ప్రొద్దుటూరు, జనవరి 22: ప్రొద్దుటూరులో టీడీపీ నాయకులపై ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి ఒత్తిళ్లతో పోలీసులు అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేసి జైళ్లకు పంపుతున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి ఆగ్రహించారు. సోమవారం టీడీపీ నాయకుడు ఆవుల దస్తగిరి డబ్బుల బాకీ విషయమై చిన్న గొడవ పడ్డారు. దీన్ని కారణంగా చూపి పోలీసులు అక్రమంగా కిడ్నాప్, హత్యాయత్నం లాంటి తప్పుడు కేసులు బనాయించడాన్ని వ్యతిరేకిస్తూ టీడీపీ కార్యకర్తలతో కలిసి ప్రవీణ్‌రెడ్డి త్రీటౌన్ పోలీసు స్టేషన్లో బైఠాయించి ఆందోళన చేపట్టారు. సీఐ బయటికి రావాలి అని నినాదాలు చేశారు. ఈసందర్భంగా ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ 2022లో నమోదైన 307 కేసులో నిందితులైన వైసీపీ నాయకులు భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి(కౌన్సిలర్), గరిశపాటి లక్ష్మీదేవి (కౌనిలర్), గురనాద్‌రెడ్డిలను ఎందుకు అరెస్టు చేయలేదని పోలీసులను నిలదీశారు. వన్‌టౌన్ మహిళా ఎస్ఐ హైమావతిపై రాళ్ల దాడిచేసిన ఇసుక మాఫియాను ఎందుకు అరెస్టు చేయలేదో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఎస్ఈబీ పోలీసుస్టేషన్‌కు వెళ్లి ముస్లిం ఎస్ఐ అలీబేగ్ చైర్‌లో కూర్చోని అతన్ని నిలబెట్టి దూషించిన ఎమ్మెల్యే రాచమల్లుపై కేసు ఎందుకు నమోదు చేయలేదని నిలదీశారు. జిల్లా ఎస్పీని సైతం దారుణంగా మాట్లాడితే ఎమ్మెల్యేపై ఎందుకు చర్యలు తీసుకోలేదన్నారు. ప్రొద్దుటూరులో పోలీసులు రాజ్యాంగ బద్ధంగా పనిచేస్తున్నారా.. రాచమల్లు కింద పనిచేస్తున్నారో తెలపాలన్నారు. రేపటి నుంచి వైసీపీ నాయకులను అరెస్టు చేయకపోవడంపై ప్రజల్లోకి వెళ్లి విస్తృత ప్రచారంతో పాటు పోలీసులపై పోరాటం చేస్తానన్నారు. జాతీయ ఎన్నికల కమిషనుకు కూడా పోలీసు అధికారుల పక్షపాత వైఖరిపై ఫిర్యాదు చేస్తామని తెలిపారు. సీఐలు వెంకటరమణ, శ్రీకాంత్ యాదవ్‌లు ప్రవీణ్‌రెడ్డితో చర్చించారు. ఈ ఆందోళనలో ప్రవీణ్‌రెడ్డి వెంట టీడీపీ సీనియర్ నేత ఈవీ సుధాకర్‌రెడ్డి టీడీపీ పట్టణ అధ్యక్షుడు వైఎస్ జబీవుల్లా, కౌన్సిలర్ వైస్‌మహ్మద్ గౌస్, టీడీపీ పట్టణ మహిళా అధ్యక్షురాలు లక్ష్మీనారాయణమ్మ, జిల్లా నాయకురాలు శ్రీదేవి, బీసీ మహిళా నేత దక్కి లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.


పోలీసు స్టేషన్‌లో సీఐలతో ప్రవీణ్‌రెడ్డి వాగ్వాదం

పశు వ్యాధులపై అవగాహన సదస్సు

రామాపురం, జనవరి 22: రాచపల్లి పంచాయతీలోని రైతు భరోసా కేంద్రం వద్ద సోమవారం రైతులకు పశు వ్యాధుల పట్ల అవగాహన సదస్సును జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి గుణశేఖర్‌పిళ్లై నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాచపల్లి పంచాయతీలోని గంగనేరు, పొలిమేరపల్లె గ్రామాల్లో ఆయన పర్యటించారు. గత కొన్ని రోజులుగా చనిపోతున్న ఆవుల వ్యాధి నివారణ చర్యలు, కాలానుగుణంగా వచ్చే వ్యాధుల గురించి పశువుల యజమానులకు వివరించారు. మంగళవారం ఆ గ్రామంలో పశువైద్య బృందం ఆధ్వర్యం లో పశువులు పశువైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ శిబిరంలో గ్రామంలో ఉన్న ప్రతి పశువులకు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాల్సిందిగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో రాయచోటి ఉపసంచాలకులు మాలకొండయ్య, పశువైద్యాధికారి ప్రవీణ్ కుమార్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి

ఆలిండియా హాకీ టోర్నమెంట్‌కు ఎంపికైన అండర్-14 జిల్లా బాలుర జట్టు

కడప (స్పోర్ట్స్), జనవరి 22 : లక్నోలో ఈనెల 26 నుంచి ఫిబ్రవరి 2 వరకు జరుగనున్న 34వ ఆల్ ఇండియా కేడీ సింగ్‌బాబు సబ్ జూనియర్స్ అండర్-14 బాలుర హాకీ టోర్నమెంట్‌కు జిల్లా జట్టును ఎంపిక చేశారు. ఆ మేరకు సోమవారం స్థానిక డీఎస్ఏ స్టేడియంలో నిర్వహించిన జిల్లా హాకీ జట్టు ఎంపికలకు వివిధ జిల్లాల నుంచి ఔత్సాహిక క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ కనబరిచిన 16 మంది బాలురను ఎంపిక చేసినట్లు కడప ధ్యాన్‌చంద్ హాకీ అకాడమీ డైరెక్టర్-సెక్రటరీ సుభాన్‌బాషా వెల్లడించారు.


ఎంపికైన జిల్లా బాలుర జట్టుతో సుభాన్‌బాషా

ఎంపికైన జిల్లా బాలుర జట్టు : సాయిమోహన్, మస్తాన్‌బాషా, సురేష్, మహిధర్, హర్షవర్ధన్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, పార్థివర్మ, అజయ్‌కుమార్‌రెడ్డి, అబూబకర్‌సిద్ధిక్, వెంకట సందీప్‌రెడ్డి, జస్వంత్, కిశోర్, నాగతరుణ్, సాయిచరణ్, అలీ మురాద్‌బాష, కీర్తన్‌కాంత్‌రెడ్డి ఉన్నారు. ఎంపికైన బాలుర జట్టుకు సుభాన్‌బాషా టీ షర్ట్స్ అందజేశారు. డీఎస్ఏ హాకీ కోచ్ కల్యాణ్‌కుమార్, సీనియర్ హాకీ క్రీడాకారులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి పెట్టండి

రాయచోటిటౌన్, జనవరి 22: స్పందన కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్పీ కృష్ణారావు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో స్పందన (గ్రీవన్స్ డే) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 43 ఫిర్యాదులను పరిశీలించారు. ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ స్పందన కార్యక్రమం ద్వారా వచ్చే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం చేకూర్చాలన్నారు. అలాగే ఫిర్యాదు దారులతో నేరుగా మాట్లాడడమే కాకుండా వీడియో కాన్ఫరెన్స్, టెలికాన్ఫరెన్స్‌లో వారి సమస్యలను అడిగి తెలుసుకుని న్యాయం జరిగేలా చూస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులపై సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదుదారులకు చట్ట పరిధిలో సత్వర న్యాయం అందించాలని, తీసుకున్న చర్యల నివేదికను ఎప్పటికప్పుడు పోలీసు ప్రధాన కార్యాలయానికి అందించాలని ఎస్పీ పోలీసు అధికారులను ఆదేశించారు.


ఫిర్యాదు దారులతో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణారావు

ఏహెచ్‌ఏ పోస్టుల భర్తీకి సర్టిఫికెట్ల వెరిఫికేషన్

కడప(రూరల్) జనవరి 22 : ఉమ్మడి కడప జిల్లాలో అనిమల్ హస్బండరీ అసిస్టెంట్(ఏహెచ్ఏ) పోస్టుల భర్తీకి సంబంధించి సోమవారం కడప కోటిరెడ్డి సర్కిల్ సమీపంలోని జిల్లా పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేపట్టారు. ఉమ్మడి జిల్లాలో 210 పోస్టులు ఉండగా 130 మంది క్వాలిఫై అయ్యారు. వీరికి జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారులు సోమ, మంగళవారాల్లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేపట్టారు. సోమవారం 59 మంది అభ్యర్థులు హాజరు కాగా... సంబంధిత అధికారులు వాటిని పరిశీలించారు.

42 మద్యం బాటిళ్లు స్వాధీనం

పెనగలూరు, జనవరి 22: మండలం లోని వేర్వేరు ప్రాంతాల్లో బెల్టుషాపు నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తుల నుంచి 42 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.సుబ్బారెడ్డి తెలిపారు. వెలగచర్లకు చెందిన సుబ్బిగారి వెంకటరమణ నుంచి 15 బాటిళ్లు, తిరణంపల్లె హరిజనవాడకు చెందిన పల్లాల బుజ్జి నుంచి 27 బాటిళ్లను సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు.

రామనామంతో మారుమోగిన ఆలయాలు





రాయచోటిలోని రెడ్డీస్‌కాలనీ రామాలయంలో సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహాలకు క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం, ఎగువ అబ్బవరం కాలనీలో భక్తులకు అన్నదానం చేస్తున్న టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్‌బాబు

- ఘనంగా జైశ్రీరామ్ శోభాయాత్ర
- ప్రత్యేక పూజలు, అభిషేకాలు
- భక్తులను ఆకట్టుకున్న కోలాటం

అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం జిల్లా కేంద్రంలోని రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో ఉన్న రామాలయాలు జైశ్రీరామ్ నినాదాలు, భజనలతో మార్మోగాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కోలాటాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఒక విధంగా శ్రీరామనవమి పండుగను భక్తులు గుర్తు చేసుకున్నట్లయింది.

రాయచోటిటౌన్/రాజంపేట/రైల్వేకోడూరు/వీరబల్లి/చిట్వేలి/పెనగలూరు/పుల్లంపేట/నందలూరు/ఒంటిమిట్ట/సిద్దవటం/గాలివీడు/చిన్నమండెం/లక్కిరెడ్డిపల్లె/ రామాపురం, జనవరి 22: అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ పర్వదినాన్ని పురష్కరించుకొని సోమవారం జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలో జైశ్రీరామ్ నినాదాలతో, భజనలతో మార్మోగింది. ఈ సందర్భంగా పట్టణంలోని హరినాథవీధికి చెందిన ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జైశ్రీరామ్ శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. హరినాథ దేవాలయం నుంచి ప్రారంభమై కంసల వీధి, ఠాణా, నేతాజి సర్కిల్, బస్టాండు మీదుగా తిరిగి హరినాథ ఆలయం వరకు సాగింది. అలాగే కొత్తపేట రామాలయాల్లో ఎల్ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేసి అయోధ్యలో జరిగిన రాముని విగ్రహ ప్రతిష్ఠను భక్తులు వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. రెడ్డీస్ కాలనీలో గల కోదం రామాలయంలో ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సీతా రామాలక్ష్మణ ఆంజనేయ స్వామి విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను పల్లకీపై ఏర్పాటు చేసి పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయం వద్దకు వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కొత్తపేట రామాపురం, ఎగువ అబ్బవరం, గాలివీడు రోడ్డులో గల రామాలయాల్లో భక్తుల ఆహ్వానం మేరకు టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్‌బాబు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

అలాగే రాజంపేట, రైల్వేకోడూరు, వీరబల్లి, చిట్వేలి, పెనగలూరు, పుల్లంపేట, నందలూరు, ఒంటిమిట్ట, సిద్దవటం, గాలివీడు, చిన్నమండెం, లక్కిరెడ్డిపల్లె, రామాపురం తదితర మండలాల్లోని ప్రజలు రామనామం జపించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కోలాటాలతో సందడి నెలకొంది. అనంతరం ఆలయాల వద్ద భక్తులకు అన్నదానం చేశారు.



రైల్వేకోడూరులో కోలాటాలు వేస్తున్న మహిళలు



వీరబల్లిలో అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకులు



రాజంపేటలోని కూచివారిపల్లె శోభాయాత్రలో మహిళల కోలాటాలు



ఒంటిమిట్టలో ఉత్సవమూర్తుల గ్రామోత్సవం



లక్కిరెడ్డిపల్లెలో ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం



నందలూరులో సీతారాముల వారికి దీపోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం



పుల్లంపేటలో సీతారాముల ఊరేగింపు

వాహనాలు తనిఖీ

రాజంపేటటౌన్, జనవరి 22: రాజంపేట ప్రధాన రహదారిలో సోమవారం సాయంత్రం మోటారు వాహనాల అధికారి పి.వినోద్‌కుమార్, మన్నూరు ఎస్ఐ భక్తవత్సలం మోటారు వాహనాలు తనిఖీ చేశారు. ప్రధానంగా ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ప్రయోజనాలను వివరించారు. హెల్మెట్ లేకపోతే జరిగే ప్రమాదాల గురించి వివరించారు. అదేవిధంగా నాలుగు చక్రాల వాహనదారులకు సీటుబెల్టు ఆవశ్యకత, అదేవిధంగా రేడియం స్టిక్కర్లు లేని వాహనాలకు స్టిక్కర్లు వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంవీఐ సిబ్బంది, మన్నూరు పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

చీరలు పంపిణీ

సుండుపల్లె, జనవరి 22: అయోధ్యలో రామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని భైరవగుట్ట అభయ ఆంజనేయస్వామి ఆలయం, సాయిబాబా స్వామి ఆలయాల్లో సోమవారం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అంతకుముందు స్వామివార్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు అభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వీరమల్లయ్యనాయుడు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా పల్లకీ ఉత్సవం

రాయచోటిటౌన్, జనవరి 22: దక్షిణకాశీగా పేరుగాంచిన పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో సోమవారం పల్లకీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్‌పర్సన్ పోలంరెడ్డి విజయ, ఆలయ ఈవో రమణారెడ్డిల ఆధ్వర్యంలో ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలు, పట్టు వస్త్రాలతో అలంకరించారు. అనంతరం పల్లకీ ఉత్సవంపై మాడవీధుల్లో ప్రదక్షిణలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని కాయాకర్పూరం సమర్పించారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

వీరబల్లి, జనవరి 22: మండల పరిధిలోని మట్లి పంచాయతీ యల్లంపల్లెలో 8 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. వెంకటరమణ అక్రమంగా మద్యం అమ్ముతున్నారని తెలియడంతో స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్

- లక్కిరెడ్డిపల్లె జూనియర్ సివిల్ జడ్జీ ఫైజున్నిసా



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జీ ఫైజున్నిసా

లక్కిరెడ్డిపల్లె, జనవరి 22: విద్యార్థులు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని లక్కిరెడ్డిపల్లె జూనియర్ సివిల్ జడ్జీ షేక్ ఫైజున్నిసా పేర్కొన్నారు. మండల లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థినిలతో మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న మెనూ ప్రకారం అన్నీ సక్రమంగా అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తేవాలన్నారు. అంతేకాకుండా మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, విద్యాహక్కు చట్టం ప్రకారం బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. పది, ఇంటర్మీడియట్ పరీక్షలు దగ్గర పడుతున్నాయని, బాగా చదివి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, న్యాయవాది సిద్దయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి సీఎం ఏం న్యాయం చేస్తారు ?

- నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ విశ్వనాథనాయుడు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కస్తూరి

రైల్వేకోడూరు, జనవరి 22: తల్లికి, చెల్లికి న్యాయం చేయని సీఎం జగన్ రాష్ట్ర ప్రజలకు ఏం న్యాయం చేస్తారని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ కస్తూరి విశ్వనాథనాయుడు అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో 9 సార్లు విద్యుత్ చార్జీలను వైసీపీ సర్కార్ పెంచిందని, టీడీపీ ఐదేళ్ల పాలనలో ఒక్క పైసా చార్జీలు పెంచలేదని గుర్తు చేశారు. పిల్లల భవిష్యత్తు బాగుపడాలన్నా, ఉపాధి అవకాశాలు కావాలన్నా చంద్రబాబు సీఎం కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వరనాయుడు, మాజీ ఎంపీటీసీ ఫణీంద్ర, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శివ, నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి నాగినేని సురేష్, బూత్ ఇన్‌చార్జ్ వెంకటేశ్వర్లు ఆచారి, నందిమండలం ప్రసాద్ పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: అంతర్జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో క్రీడాకారిణి హస్తి తేజస్విని రాణించి, కోడూరుకు మంచి పేరు తీసుకురావాలని సోమవారం రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జ్ విశ్వనాథనాయుడు తెలిపారు. ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు టీడీపీ ప్రభుత్వం మంచి ప్రాధాన్యత కల్పించారని గుర్తు చేశారు. తేజస్విని జాతీయ స్థాయిలో సిల్వర్ మెడల్ సాధించిందని, అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకాన్ని సాధించాలని కోరారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త విశ్వేశ్వరనాయుడు, మాజీ సర్పంచ్ సుబ్బరాయుడు, మైనార్టీ నాయకుడు పఠాన్ మౌలా, హరి, క్రీడాకారిణి తల్లిదండ్రులు చంద్రరాజు, సుప్రజ పాల్గొన్నారు.

చిట్వేలి: చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కస్తూరి విశ్వనాధనాయుడు అన్నారు. ఈ మేరకు సోమవారం మండల పరిధిలోని సి.కందులవారిపల్లె పంచాయతీలోని తుమ్మచెట్లపల్లె గ్రామంలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా మండల టీడీపీ అధ్యక్షుడు కె.కె.చౌదరి అధ్యక్షతన పార్టీలో చేరారు. కార్యక్రమంలో తుంగా పిచ్చయ్యనాయుడు, చరణ్, కోటేశ్వర్‌నాయుడు, వెంకట నాగులు, బొప్పాయి శ్రీనివాసనాయుడు, వెంకటేశ్వరరాజు, బాలకృష్ణయాదవ్ పాల్గొన్నారు.

నారా లోకేశ్‌ను కలిసిన విశ్వబ్రాహ్మణులు

- బీసీలకు ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలని వినతి



నారా లోకేశ్‌తో బీసీ నాయకులు

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 22: ఏపీ విశ్వబ్రాహ్మణుల సంఘం ప్రధాన కార్యదర్శి పొలిటికల్ సమన్వయ కమిటీ సభ్యులు దువ్వూరు నరసింహాచారిలు టీడీపీ జాతీయ కార్యదర్శి లోకేశ్‌ను కలిశారు. ఈ మేరకు విజయవాడలోని ఆయన నివాసంలో సోమ వారం కలిసి ఏపీలో విశ్వబ్రాహ్మణులకు రెండు అసెంబ్లీ సీట్లతో పాటు ఒక ఎమ్మెల్సీ స్థానాన్ని కేటాయించాలన్నారు. ఏపీ వడ్డెర సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఇడగొట్టు నాగేశ్వరరావు, విశ్వబ్రాహ్మణుల సంఘం రాష్ట్ర మహిళా సెక్రటరీ సుజాత, ఒంగోలు జిల్లా మహిళాధ్యక్షురాలు సోనాక్షి, శ్రీనివాసులుచారి, నందవీరప్రసాద్, బొల్లాపల్లి సిద్దు, ధనాల్‌కోట శోభన్‌బాబులు పాల్గొన్నారు.

రామమందిరం ప్రపంచానికే తలమానికం

- టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని



పూజలు చేస్తున్న పంతగాని తదితరులు

రైల్వేకోడూరు, జనవరి 22: అయోధ్యలో రామ మందిరం ప్రపంచానికే తలమానికంగా నిలిచిందని టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్ తెలిపారు. సోమవారం అయోధ్యలో బాలరాముడు ప్రాణప్రతిష్ఠ సందర్భంగా గుండాలపల్లె, రెడ్డివారిపల్లె తదితర ప్రాంతాల్లో ఉన్న ప్రజల ఆహ్వానం మేరకు రామాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ తెలుగు యువత రాష్ట్ర నాయకుడు బొక్కసం సునీల్, టీడీపీ నాయకుడు మండ్ల అమర్‌నాథ్, దళిత సీనియర్ నాయకులు కూని చంద్రయ్య, గ్రామస్తులు పగడాల మణిప్రసాద్, పగిడి బాబు, విశ్వనాథ్, నరసింహులు, సవరం సాయి, పంద్రా నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

చిన్నమండెం, జనవరి 22: మండలంలోని బోరెడ్డిగారిపల్లె కూడలి వద్ద ఎస్ఐ రమేశ్‌బాబు సోమవారం సైబర్ నేరాలపై ప్రజలకు క్షుణ్ణంగా వివరించారు. ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు ఓటీపీ నేరాలు అధికంగా చేస్తున్నారని, అపరిచిత నెంబర్ల నుంచి ఫోన్లు చేస్తే స్పందించవద్దు అన్నారు. చదువుకున్న యువకులు సైతం ఈజీ మనీకి అలవాటు పడి సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకుంటున్నారని, వాటిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే వాహనాలు అధిక వేగంతో వెళ్లడం వల్ల ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీపీఐ, సీపీఎం నిరసన

రాజంపేట, జనవరి 22: అంగన్‌వాడీలపై ప్రభుత్వం నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ రాజంపేట సీపీఐ, సీపీఎం నాయకులు సంయుక్తంగా నిరసన వ్యక్తం చేశారు. రాజ్యాంగబద్ధంగా అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె చేస్తుంటే ఆ సమ్మెను అణిచివేస్తూ వారిపై నిర్బంధాన్ని విధించి రాజ్యాంగ విలువలు తుంగలో తొక్కడం తగదన్నారు. జగన్ ప్రభుత్వ వైఖరి నిరసిస్తూ డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మహేశ్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రవికుమార్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శివరామకృష్ణదేవర, కార్యదర్శి ఎం.ఎస్.రాయుడు, పట్టణ కార్యదర్శి సికిందర్, ఏఐటీయూసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

బీసీల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యం

సుండుపల్లె, జనవరి 22: బీసీల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోడెం సిద్దయ్య, కమతం నాగరాజుయాదవ్‌లు తెలిపారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జయహో బీసీ కార్యక్రమంలో వారు ప్రసంగించారు. సీఎం జగన్.. బీసీలను ఓ వైపు పొగుడుతూ, మరోవైపు తుంగలో తొక్కేశారని విమర్శించారు. రాష్ట్ర చరిత్రలో బీసీలకు పెద్దపీట వేసిన ఏకైక పార్టీ టీడీపీ అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రెడ్డెప్ప, జనసేన మండల మహిళా అధ్యక్షురాలు రెడ్డిరాణి, పాల ఏకరి సాధికార కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు శివప్రసాద్‌నాయుడు, కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీధర్‌బాబు, రాష్ట్ర, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధికార ప్రతినిధులు శివకుమార్‌నాయుడు, దామోదర్‌నాయుడు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌సీ స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ



రాయచోటిటౌన్, జనవరి 22: డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు ఆధ్వర్యంలో రూపొందించిన ఎస్ఎస్‌సీ స్టడీ మెటీరియల్‌ను డీఈఓ శ్రీరామ్‌పురుషోత్తం సోమవారం సాయంత్రం డీఈవో కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్చిలో జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాయనున్న విద్యార్థులకు ఈ స్టడీ మెటీరియల్ అత్యధిక మార్కుల సాధనకు ఉపయోగపడుతుందని తెలిపారు. నూతన ప్రశ్నా పత్రానికి అనుగుణంగా అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే ఈ మెటీరియల్‌ను తయారు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ నాగమునిరెడ్డి, ఏడీ ప్రసాద్‌బాబు, పీఆర్‌టీయూ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ కొండూరు శ్రీనివాసరాజు, ప్రధానోపాధ్యాయులు నరసింహారెడ్డి, వేణుగోపాల్‌రావు, వైఎస్ఆర్ టీఎఫ్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, రియాజ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల అరెస్టు అన్యాయం: సీఐటీయూ

రైల్వేకోడూరు, జనవరి 22: అంగన్వాడీలు శాంతియుతంగా తమ సమస్యలపై పోరాటాలు చేస్తుంటే పోలీసులతో దౌర్జన్యంగా అరెస్టులు చేయించడం అన్యాయమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం రైల్వేకోడూరు సీఐటీయూ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర నాయకులు ఆమరణ దీక్షలు చేస్తుంటే తెల్లవారుజామున విద్యుత్ బల్బులు ఆర్పివేసి దీక్షా శిబిరాన్ని కూల్చి వేశారన్నారు. రాజధాని విజయవాడలో జగన్నకు చెబుదాం అనే కార్యక్రమానికి వెళ్తున్న అంగన్వాడీలను అరెస్టులు చేయించడం దారుమణని తెలిపారు. జీతాలు పెంచే ప్రయత్నం చేయకుండా ప్రభుత్వం మొండి గా ప్రవర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ సీనియర్ నాయకుడు హరినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులపై అవగాహన పెంచుకోండి

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 22: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి విధుల నిర్వహణపై మరింత అవగాహన పెంచుకోవాలని నోడల్ అధికారులకు కలెక్టర్ షన్మోహన్ సూచించారు. సోమవారం రాత్రి కలెక్టరేట్‌లో ఆయన నోడల్ అధికారులతో సమావేశమయ్యారు. మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్, ట్రైనింగ్ మేనేజ్‌మెంట్, మెటీరియల్ మేనేజ్‌మెంట్, ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్‌మెంట్, సైబర్ సెక్యూరిటీ, స్వీప్ యాక్టివిటీస్, ఈవీఎం మేనేజ్‌మెంట్, ఎంసీసీ, ఎక్స్‌పెండీచర్ మానిటరింగ్ పోస్టల్ బ్యాలెట్, ఎంసీఎంసీ తదితర విభాగాలకు సంబంధించిన అధికారులు బాధ్యతతో పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో జేసీ శ్రీనివాసులు, డీఆర్వో రాజశేఖర్, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

నేడు మాక్ పోల్ : అన్ని పాఠశాలల్లో మంగళవారం విధిగా మాక్‌పోల్ నిర్వహించాలని విద్యాశాఖ అధికారులను కలెక్టర్ షన్మోహన్ ఆదేశించారు. మాక్‌పోల్ నిర్వహణ ద్వారా విద్యార్థుల్లో ఓటు హక్కు వినియోగించుకునే అంశంపై అవగాహన కలుగుతుందన్నారు. 25న జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా అవగాహనా కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించి ఓటుహక్కు ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయాలన్నారు. కళాశాలలు, వసతిగృహాలు, స్వయంసహాయక సంఘాల మహిళలకు రంగోళి, విద్యార్థులకు వ్యాస, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ శ్రీనివాసులు, డీఆర్వో రాజశేఖర్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంఈవోలు పాల్గొన్నారు.

మారథాన్‌లో ఎస్‌ఐ ప్రతిభ


మారథాన్‌లో పాల్గొన్న ఎస్‌ఐ రామకృష్ణ

చిత్తూరు, జనవరి 22: జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో ఎస్‌ఐగా పనిచేస్తున్న వి.రామకృష్ణ మారథాన్ పరుగుపందెంలో విశేష ప్రతిభ కనబరిచారు. ముంబైలో జరిగిన టాటా ముంబై మారథాన్ పోటీలలో 42.2 కిలోమీటర్ల దూరాన్ని 3 గంటల 31 నిమిషాల్లో పూర్తి చేసి రికార్డు సృష్టించారు. గతేడాది ఇదే పోటీలో ఆయన 4గంటల 19 నిమిషాల్లో పూర్తి చేయగా, ఈ ఏడాది 48 నిమిషాల సమయాన్ని తగ్గించి తన రికార్డును తానే బ్రేక్ చేశారు. ఆయన్ను ఎస్పీ రిషాంత్‌రెడ్డి, ఇతర పోలీసు అధికారులు అభినందించారు. రాబోయే యూఎస్‌ఏ బోస్టర్ మారథాన్ పోటీల్లో పాల్గొని రికార్డు సాధించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

రూ.93.64 కోట్ల జడ్పీ మిగులు బడ్జెట్ ఆమోదం

● స్థాయిసంఘ సమావేశంలో తీర్మానం


సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 22: రానున్న 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.93.64 కోట్ల జిల్లా పరిషత్ మిగులు బడ్జెట్‌ను 1-7 స్థాయి సంఘం ఏకగ్రీవంగా ఆమోదం తెలుపుతూ తీర్మానించింది. సోమవారం జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అధ్యక్షతన 1, 7 స్థాయి సంఘ సమావేశం ఆయన చాంబర్‌లో జరిగింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాబడి పద్దులో రూ.4133.08 కోట్లు, అంచనా వ్యయపద్దులో రూ.4039.44 కోట్లుగా, మిగులు పద్దులో రూ.93.64 కోట్లతో జడ్పీ బడ్జెట్‌లో రూపొందించారు. ఈ అంచనా బడ్జెట్‌ను మంగళవారం జరిగే జడ్పీ సర్వసభ్య సమావేశంలో ప్రవేశపెడతారు. ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో ఓటర్ల సౌలభ్యం కోసం పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక వసతులు కల్పించాలని పీఆర్ ఇంజనీరింగ్ అధికారులకు జడ్పీ చైర్మన్ సూచించారు. ఎక్స్‌ప్రెస్ హైవేకు సమాంతరంగా సర్వీసు రోడ్లు ఏర్పాట్లు చేయాలన్నారు. కుప్పం, పలమనేరు, వి.కోటల్లో జడ్పీ అతిథిగృహాలను పునర్నిర్మించాల్సి ఉందన్నారు. బోయకొండ మల్లయ్యకొండ, దుర్గంకొండ తదితర ప్రాంతాల్లో నిర్మాణాలకు అంచనాలు సిద్ధంచేయాలని సూచించారు. బడ్జెట్ అంచనాల గురించి సీఈవో ప్రభాకర్‌రెడ్డి క్లుప్తంగా వివరించారు. జడ్పీ వైస్‌చైర్మన్లు ధనుంజయ రెడ్డి, రమ్య, స్టాండింగ్ కమిటీ సభ్యులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

చిత్తూరు, జనవరి 22: చిత్తూరులో సోమవారం బీటెక్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. సాంబయ్యకండ్రిగకు చెందిన చంద్రశేఖర్(22) ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాల కారణంగా సోమవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఇన్‌చార్జి సీఐ ఉలసయ్య తెలిపారు.

చంద్రబాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్తు : టీడీపీ


గడప గడపకు రా.. కదలిరా కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ, జనసేన నేతలు

చిత్తూరు సిటీ, జనవరి 22: చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రానికి భవిష్యత్తు వస్తుందని టీడీపీ నేతలు అన్నారు. చిత్తూరు నగరం దొడ్డిపల్లి, సాంబయ్యకండ్రిగలో సోమవారం టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో గడప గడపకు 'రా.. కదలిరా' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా రాష్ట్రానికి టెక్నాలజీని తీసుకురావాలన్నా, నిరుద్యోగాన్ని అరికట్టడానికి ప్రసిద్ధి చెందిన కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నా, అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందాలన్నా చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. సీఎం జగన్ అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రతిపక్షాలపై కేసులు పెట్టడం.. దాడులు చేయించడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. నేతలు చంద్రప్రకాష్, సీఆర్ రాజన్, కటారి హేమలత, కాజూరు బాలాజి, గురజాల జగన్‌మోహన్, డీకే బద్రినారాయణ, కోదండ యాదవ్, మోహన్‌రాజ్, యాదవ్, దుర్గాచౌదరి, రాజశేఖర్, శశికర్ బాబు, శ్రీనివాసులు, కిరణ్, హరి, తారాపతి, కన్నెప్ప, మునిరత్నం నాయుడు, గోపాలకృష్ణ, యుగంధర్, కాశి, జయశంకర్, జనసేన నేతలు దయారాం, ఆరణి కవిత, యశ్వంత్, ఏకే శరవణ, రూపేష్ తదితరులు పాల్గొన్నారు.

132వ రోజుకు చేరిన డెయిరీ కార్మికుల దీక్ష


కలెక్టరేట్ ముందు దీక్ష చేస్తున్న డెయిరీ కార్మికులు

చిత్తూరు (సెంట్రల్), సెంట్రల్ 22: పెండింగ్ జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ విజయా డెయిరీ కార్మికులు కలెక్టరేట్ ముందు చేపట్టిన దీక్ష సోమవారానికి 132వ రోజుకు చేరింది. మూడు నెలలకు పైబడి కలెక్టరేట్ ముందు దీక్ష చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. తమకు న్యాయం చేయాలని కార్మికులు రూబన్, కుమార్, వెంకట్‌రెడ్డి, భాస్కర్, రవి, వెంకటాచలం తదితరులు విజ్ఞప్తి చేశారు.

'అంగన్వాడీల అక్రమ అరెస్టు తగదు'



అంబేడ్కర్ విగ్రహం వద్ద కార్మిక సంఘాల నిరసన

చిత్తూరు రూరల్, జనవరి 22: విజయవాడలో దీక్షకు వెళ్తున్న అంగన్వాడీలను అక్రమంగా అరెస్టు చేయడం తగదని సీపీఐ, సీపీఎం, కార్మిక సంఘాల నేతలు పేర్కొన్నారు. చిత్తూరులోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట సోమవారం వీరు నిరసన తెలిపారు. అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించపోగా, ఎస్మా చట్టం ద్వారా భయభ్రాంతులకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వారి సమస్యను విజయవాడలో తెలిపేందుకు వెళ్తున్న వారిని పోలీసులు అక్రమ అరెస్టు చేయడం దుర్మార్గపు చర్య అని విమర్శించారు. సీపీఐ నేత నాగరాజు, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయకపోతే ఆత్మహత్యే శరణ్యం

● కలెక్టరేట్ వద్ద పురుగుల మందు డబ్బాతో ఓ దళిత కుటుంబం నిరసన


బిడ్డలతో కలసి పురుగుల మందు డబ్బాతో కలెక్టరేట్ వద్ద కూర్చున్న సుబ్రహ్మణ్యం

చిత్తూరు, జనవవరి 22: ఈ ఫొటోలో దీనంగా కూర్చున్నది ఓ దళిత కుటుంబం. రెక్కాడితేగాని డొక్కాడని పరిస్థితి. వంశపారపర్యంగా వచ్చిన భూమికి పట్టాలివ్వాలని నాలుగేళ్లుగా అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేదు. దాంతో అనుభవంలో ఉన్న భూమికి పట్టాదార్ పాసుపుస్తకాన్ని ఇవ్వకపోతే ఆత్మహత్యే శరణ్యమంటూ సోమవారం 'స్పందన' నేపథ్యంలో కలెక్టరేట్ వద్ద పురుగుల మందు డబ్బాతో ఈ కుటుంబం ఆందోళనకు దిగింది. అధికారుల హామీతో వెనుతిరిగారు. వివరాలిలా ఉన్నాయి. వి.కోట మండలం సుద్దులగుంట గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యంకు 74 ముదరండొడ్డి గ్రామ లెక్కదాఖలాలో సర్వే నెంబరు 788-1లో 3.30 ఎకరాలు, 789-2లో 1.30 ఎకరాల భూమితో కలిపి మొత్తం 4.60 ఎకరాలు ఉన్నాయి. వీటిలో కొంత బండ, పెద్ద పెద్ద రాళ్లు ఉన్నాయి. రాళ్లుపోనూ 3.30 ఎకరాల సేద్యపు భూమి ఉంది. ఈ భూమిని సర్వే చేసి పట్టాదార్ పాసుపుస్తకాలు ఇవ్వాలని నాలుగేళ్లుగా తహసీల్దారును కోరుతున్నారు. కొన్ని నెలల క్రితం రెవెన్యూ అధికారులు సర్వే చేసి 1.30 ఎకరాలు మాత్రమే అని చెప్పి స్కెచ్‌వేసి ఇచ్చారు. వంశపారంపర్యంగా వచ్చిన భూమిలో చింత చెట్లు, మామిడి చెట్లు, తైలం చెట్లు ఉండే ఆధారాలను కూడా రెవెన్యూ అధికారులకు సుబ్రహ్మణ్యం చూపారు. గ్రామంలో కొంత మంది రాజకీయ నాయకుల మాటలు విని తన భూమిని తక్కువ చేసి చూపిస్తున్నారని ఆయన ఆరోపించారు. మండల స్థాయిలో తనకు న్యాయం జరగదని భావించి.. కుటుంబంతో కలిసి సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమానికి వచ్చారు. ఇతడి భార్య భూలక్ష్మి అర్జీ ఇవ్వడానికి క్యూలో నిల్చోగా.. ఇతడు బిడ్డలతో కలిసి తన వెంట తెచ్చుకున్న పురుగుల మందు డబ్బా బయటకు తీసి కలెక్టరేట్ వద్ద నిరసనగా కూర్చున్నారు. గుర్తించిన అధికారులు, పోలీసులు వెంటనే పురుగుల మందును తీసుకుని బాధితుడ్ని జేసీ వద్దకు తీసుకెళ్లారు. తనకు జరిగిన అన్యాయాన్ని భార్యతో కలిసి వివరించారు. తనకు ముగ్గురు పిల్లలు ఉన్నారని, ఈ భూమి తప్ప ఇతర ఆదాయమేమీ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమగ్రంగా సర్వే చేసి పట్టాదార్ పాసుపుస్తకాన్ని మంజూరు చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు.


అర్జీదారులతో మాట్లాడుతున్న జేసీ

కలెక్టరేట్ స్పందనకు 277 అర్జీలు

జిల్లా నలుమూలల నుంచి 277 మంది కలెక్టరేట్‌కు వచ్చి స్పందన కార్యక్రమంలో అర్జీలు అందజేశారు. వీరి నుంచి జేసీ శ్రీనివాసులు, డీఆర్వో రాజశేఖర్, ఇతర అధికారులు వినతిపత్రాలను స్వీకరించారు. రెవెన్యూశాఖకు 206, డీఆర్‌డీఏకు 17, జిల్లా రిజిస్ట్రారుకు 3, నేషనల్ హైవేకు 2తో పాటు ఇతర శాఖలకు 49 చొప్పున అర్జీలు అందాయి.


బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ

పోలీసు స్పందనకు 15 వినతులు

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 15 మంది బాధితులు వినతిపత్రాలను అందించారు. బాధితుల నుంచి ఎస్పీ రిషాంత్‌రెడ్డి వినతిపత్రాలను స్వీకరించారు. వీటిలో భూ తగాదాల కింద 9, ఆస్తి తగాదాలు 3, కుటుంబ తగాదాలు 2, వేధింపుల కింద 1 వంతున ఉన్నాయి. ఈ సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

కుప్పంలో ప్రొటోకాల్ వివాదం

ఎమ్మెల్యే చంద్రబాబు పేరు లేకనే ప్రారంభోత్సవ శిలాఫలకం ● టీడీపీ నేతల అభ్యంతరం




గుడుపల్లె తహసీల్దారుకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ వన్నెకుల క్షత్రియ నాయకులు - చంద్రబాబు పేరు లేకుండా సిద్ధం చేసిన శిలాఫలకం

కుప్పం, జనవరి 22: కుప్పంలో మరోసారి ప్రొటోకాల్ వివాదం రాజుకుంది. గుడుపల్లె మండలం గుత్తార్లపల్లె సమీపంలో నిర్మించిన వన్నెకుల క్షత్రియ భవన ప్రారంభోత్సవ శిలాఫలకంలో స్థానిక ఎమ్మెల్యే చంద్రబాబుతో పాటు, కుప్పం నియోజకవర్గం లోకల్ ప్రొటోకాల్ కలిగిన తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేరు లేవు. ఇది టీడీపీ వర్గాల ఆగ్రహానికి కారణమైంది. వివరాలిలా ఉన్నాయి. గుత్తార్లపల్లె సమీపంలో వన్నెకుల క్షత్రియకులస్థులకు టీడీపీ హయాం లో ఒక ఎకరా స్థలాన్ని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు కేటాయించారు. సుమారు రూ.2 కోట్ల విలువ కలిగిన ఈ స్థలంలో నిర్మాణాన్ని ప్రారంభించారు. టీడీపీ అధికారం కోల్పోవడంతో ఈ నిర్మాణం ఆగిపోయింది. ఎన్నికలు దగ్గర పడుతుండడంతో ఇటీవల హడావిడిగా మిగిలిన పనులు పూర్తి చేశారు. దానికి వన్నెకుల క్షత్రియ కల్యాణ మండపం అని పేరుపెట్టి, ఈనెల 24వ తేది ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు. దీనిని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభిస్తారని వన్నెకుల క్షత్రియ నాయకుడు, కుప్పం మండల వైసీపీ కన్వీనర్ మురుగేశ్ ఆదివారం చెప్పారు. టీడీపీపై విమర్శలు చేశారు. కాగా, ఈ ప్రారంభోత్సవ శిలాఫలకంపై ఎమ్మెల్యే చంద్రబాబు పేరు కానీ, స్థానిక ప్రొటోకాల్ కలిగిన ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేరు కానీ లేకపోవడం టీడీపీ శ్రేణుల దృష్టికి వచ్చింది. దీంతో టీడీపీ వన్నెకుల క్షత్రియ నాయకుడు, గుడుపల్లె మాజీ ఎంపీపీ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు ఆదివారం వన్నెకుల క్షత్రియ భవనం వద్దకు చేరుకుని ధర్నా నిర్వహించారు. స్థలం కేటాయించి, భవన నిర్మాణం కూడా 90 శాతం పూర్తి చేసింది టీడీపీ హయాంలోనని గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక నిర్మాణం ఆగిపోయిన విషయం అందరికీ తెలుసన్నారు. దీనిపై ధర్నా కూడా చేశామని గుర్తు చేశారు. నాలుగేళ్లు మౌనంగా ఉన్న వైసీపీ నాయకులు ఎన్నికలు దగ్గర పడ్డాక స్వలాభంకోసం మిగిలిన 10 శాతం పనులను నాసిరకంగా పూర్తి చేసి ప్రారంభోత్సవ హడావుడి చేస్తున్నారని విమర్శించారు. శిలాఫలకంలో చంద్రబాబు, కంచర్ల శ్రీకాంత్ పేర్లు లేకపోవడం దారుణమని మండిపడ్డారు. ప్రొటోకాల్ ప్రకారం ఆ ఇద్దరి పేర్లూ వేయాలని డిమాండు చేశారు. దీనిపై గుడుపల్లె తహసీల్దారు గుర్రప్పకు ఫిర్యాదు చేశారు.

వడివడిగా ఆర్థిక నిధులు

● పంచాయతీలకు మరో విడత విడుదల

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 22: గ్రామపంచాయతీలకు ఎట్టకేలకు ఆర్థిక సంఘం నిధులు మంజూరయ్యాయి. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తొలివిడత నిధులు వారం కిందట విడుదలయ్యాయి. రెండో విడత కింద రూ.28.95 కోట్లు, వడ్డీ రూపేణ మరో రూ.26.83 లక్షలు సోమవారం విడుదల చేశారు. అన్‌టైడ్ పద్దు కింద రూ.11.52 కోట్లు, వడ్డీ కింద రూ.10.48 లక్షలు, టైడ్ పద్దు కింద రూ.17.43 కోట్లు, వడ్డీ కింద రూ.16.35 లక్షలు విడుదలయ్యాయి. అన్‌టైడ్ కింద మంజూరు చేసిన నిధులను జిల్లాలోని 684 గ్రామ పంచాయతీల ఖాతాలకు జమచేయగా, టైడ్ కింద సోమవారం విడుదలైన నిధులను నాలుగైదు రోజుల్లో పంచాయతీల ఖాతాలకు పీఎఫ్ఎంఎస్ ద్వారా జమకానున్నాయి. ఈ నిధులను క్లాప్‌మిత్ర జీతాలు, గ్రామాల్లో డ్రైయిన్ల నిర్మాణం, ఎల్ఈడీ బల్బుల ఏర్పాట్లతో పాటు తాగునీటి వసతి కల్పించేందుకు వినియోగించనున్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

పుంగనూరు రూరల్, జనవరి22: క్రికెట్ ఆటల్లో చోటుచేసుకున్న ఘర్షణలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ మహేంద్ర తెలిపారు. ఆయన కథనం మేరకు .. మండలంలోని భీమగానిపల్లె పంచాయతీ ఉలవలదిన్నె సమీపంలో ఆదివారం రాత్రి శివరాజు, రితేశ్ వర్గీయులు ఘర్షణ పడి గాయపడ్డారు. ఈ నేపథ్యంలో శివరాజు ఫిర్యాదు మేరకు సుబ్రహ్మణ్యం, లవకుమార్, రీతేశ్, దివాకర్, సురేశ్, మహేశ్, కృష్ణప్పలపై, రితేశ్ ఫిర్యాదు మేరకు శివరాజ్, శ్రీనివాసులు, శివకుమార్, వెంకటరమణ, ఆదినారాయణ, సతీశ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

జిల్లా ఎన్నికల ప్రచారకర్తగా తులసిరెడ్డి



చిత్తూరు కలెక్టరేట్, జనవరి 22: సార్వత్రిక ఎన్నికలు వస్తున్న తరుణంలో ఓటర్లకు ఓటింగ్‌పై అవగాహన కల్పించడంలో భాగంగా స్వీప్ కార్యక్రమానికి జిల్లా ఎన్నికల ప్రచార కార్యకర్తగా ఎం.తులసిరెడ్డి నియమితులయ్యారు. బంగారుపాళ్యం మండలానికి చెందిన ఈయన ఈనెల 25న చిత్తూరులోని అంబేడ్కర్ భవన్‌లో జరిగే జాతీయ ఓటర్ల దినోత్సవంలో పాల్గొంటారు. అంతర్జాతీయ వాలీబాల్ క్రీడాకారుడైన తులసిరెడ్డి 1995-2002 వరకు అంతర్జాతీయ వాలీబాల్ క్రీడాబృందంలో భారతదేశం తరఫున పాల్గొన్నారు. గతంలో ఏపీ సీనియర్ వాలీబాల్ (మెన్) టీమ్‌కు కోచ్‌గా వ్యవహరించారు. ప్రస్తుతం ఆయన ఐవోబీ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు.

పలువురు ఏఆర్ ఎస్‌ఐల బదిలీ

చిత్తూరు, జనవరి 22: జిల్లాలో పలువురు ఏఆర్ ఎస్‌ఐలు బదిలీ అయ్యారు. వీరంతా తమకు కేటాయించిన చోట్ల రెండు రోజుల్లో విధుల్లో చేరాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీ అయిన వారి వివరాలు.. అనంతపురం జిల్లాలో పనిచేస్తున్న కె.ప్రవీణ్‌కుమార్, ఎం. బాలాజీ నాయక్, ఎస్.మగ్బుల్, ఎం.రమేష్‌నాయక్, ముస్తఫాను చిత్తూరుకు బదిలీ చేశారు. చిత్తూరులో ఉన్న బి. రామ్మోహన్‌ను నంద్యాలకు, టీసీబాబును కడపకు, ఎంజీ నటరాజ్‌ను అన్నమయ్య జిల్లాకు, గోపాల్, ఫజులుద్దీన్‌లను అనంతపురంజిల్లాకు బదిలీ చేశారు.

వీర్నమలలో కోలాహలంగా మైలారు పండుగ



మైలారు పండుగను తిలకించేందుకు వచ్చిన అశేష జనం - జనసమూహం మధ్య దూసుకెళ్తున్న ఎద్దులు

రామకుప్పం.జనవరి 22: రామకుప్పం మండలం వీర్నమలలో సోమవారం మైలారు పండుగ కోలాహలంగా జరిగింది. పండుగను తిలకించేందుకు వచ్చిన అశేషజనంతో వీర్నమల జనసంద్రంగా మారింది. మధ్యాహ్నం 12గంటలకు గ్రామదేవత గంగమ్మ ఆలయంలో అమ్మవారికి, పశువులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పాత పంచాయతీ కార్యాలయం వీధిలో ఏర్పాటు చేసిన బరిలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు తమ ఎద్దులను డప్పులహోరు మధ్య పరుగులు తీయించారు. వేగంతో దూసుకెళ్తున్న ఎద్దులను నిలువరించేందుకు ప్రయత్నించారు. ఎద్దులను నిలువరించిన యువకులు ఆనందోత్సాహాలతో కేరింతలతో నృత్యాలు చేశారు. సుమారు మూడు గంటల పాటు జరిగిన మైలారు పండుగలో ఎటువంటి అవాంఛనీయ ఘటలు జరగక పోవడంతో నిర్వాహకులు ఊపిరి పీల్చుకున్నారు. తక్కువ సమయంలో బరిలో పరుగులు తీసే ఎద్దులను కొనుగోలు చేసేందుకు తమిళనాడు నుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చారు. వారు ఎద్దులను రూ.లక్ష నుంచి రూ.5లక్షల వరకు కొనుగోలు చేసినట్టు సమాచారం.

కమనీయం.. సీతారాముల కల్యాణం



స్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తులు - మంగళసూత్రం చూపుతున్న అర్చకుడు

ఐరాల(కాణిపాకం), జనవరి 22: కాణిపాకంలో సోమవారం సీతారామ కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. ప్రధాన ఆలయానికి అనుబంధ ఆలయమైన వరదరాజస్వామి ఆలయ ప్రాంగణంలో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేశు, సిబ్బంది మాడ వీధుల ద్వారా పట్టువస్త్రాలు తీసుకువచ్చి అర్చకులకు అందించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం ముత్యాల తలంబ్రాలు పోశారు. స్వామి కల్యాణాన్ని వీక్షించడానికి వేలాదిగా భక్తులు కాణిపాకం విచ్చేశారు. రాత్రి సీతారాముల ఉత్సవరులను ఊరేగించారు. అలాగే, గార్గేయనదీ తీరాన వెలసిన కోదండరామాలయంలో సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాణిపాకం సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఏఈవోలు విద్యాసాగర్‌రెడ్డి, రవీంద్రబాబు, ఎస్పీ కృష్ణారెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్, భక్తులు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డి దౌర్జన్యాలను రెండునెలల్లో అంతం చేస్తా

● పెద్దఉప్పరపల్లెలో రామచంద్రయాదవ్



సోమల, జనవరి 22: పుంగనూరు నియోజకవర్గంలో మంత్రి పెద్దిరెడ్డి రౌడీయిజం, దౌర్జన్యాలను రెండు నెలల్లో అంతం చేస్తానని బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ పేర్కొన్నారు. సోమల మండలం పెద్దఉప్పరపల్లెలో ఆదివారం పశువుల పండుగను పోలీసులు అడ్డుకున్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమానికి రామచంద్రయాదవ్ వస్తే శాంతి భద్రతల సమస్య తలెత్తుతుందంటూ పోలీసులు కారణం చూపారు. ఈ నేపథ్యంలో ఆయన సోమవారం రాత్రి ఆ గ్రామంలో పర్యటించారు. గ్రామస్తులతో మాట్లాడారు. సంక్రాంతి జరుపుకోకుండా గ్రామాల్లో కొన్ని దుష్టశక్తులు పోలీసులను అడ్డుపెట్టుకుని భయపెడుతున్నారని, ఎవరి బెదిరింపులకు భయపడరాదని తాను అండగా ఉంటానని తెలిపారు. నియోజవర్గంలో ఒక్క సర్పంచ్‌ను కూడా గెలిపించుకోవడం చేతకాక మంత్రి పెద్దిరెడ్డి దౌర్జన్యాలతో ఏకగ్రీవాలు చేసుకున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందు అంగన్వాడీలకు ఇచ్చిన హామీని జగన్ నెరవేర్చకుండా.. సమ్మెలోని వారిని ఉద్యోగం నుంచి తొలగించడం దారుణమన్నారు.

అంతా రామమయం

మదనపల్లె టౌన్/అర్బన్, జనవరి 22: అయోధ్యలో నిర్మించిన రామ మందిరంలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం మదనపల్లె పట్టణం, మండలం లోని అన్ని గ్రామాల్లో జైశ్రీరామ్ అంటూ ప్రజలు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. పట్టణంలోని కోటవీధి, ఆర్‌ఆర్‌వీధిలోని విశ్వబ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు, జ్యువెల్లర్స్ యజమానులు, త్యాగరాజు వీధిలో 20 వార్డు టీడీపీ కౌన్సిలర్ తులసి, రామకృష్ణ ఆధ్వర్యంలో బాలరాముడి చిత్రపటానికి పూజలు చేసి, భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. కురవంకలో సర్పంచ్ చిప్పిలి చలపతి ఆధ్వర్యంలో సీతారాములకు పూజలు నిర్వహించారు. కురబసంఘం రాష్ట్ర అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు, పొన్నే టిపాళెం మాజీ సర్పంచ్ పార్వతమ్మ పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్థానిక నిమ్మనపల్లె సర్కిల్ వద్ద బోర్‌వెల్ చంద్ర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పాల్గొని రాముడి చిత్రపటానికి పూజలు చేశారు. కమ్మగడ్డ వీధిలో తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు నాదెళ్ల అరుణ్‌తేజ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. పట్టణంలోని ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయం ఎదుట బీజేపీ జిల్లాకార్యదర్శి యల్లంవల్లె ప్రశాంత్ ఆధ్వర్యంలో సీతారాములు కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకులకృష్ణమూర్తి, అసెంబ్లీ కన్వీనర్ భగవాన్, మాజీ పట్టణ అధ్యక్షుడు బర్నేపల్లె రవికుమార్, రూరల్ అధ్యక్షుడు పచ్చిపాల వసంతకుమార్, ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. నీరుగట్టువారిపల్లె, కాట్లాటపల్లె రోడ్డులోని ప్రసన్నఆంజనేయస్వామి ఆలయంలో ఆలయకమిటీ అధ్యక్షుడు పురాణం వెంకటరత్నం, గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో విశేషపూజలు నిర్వహించారు. ఆలయం వద్ద నుంచి తొగటవీరక్షత్రియులు బైక్‌ర్యాలీ చేశారు.

పీలేరులో: పీలేరు పట్టణంలో శ్రీరాముని శోభాయాత్ర కన్నుల పండువగా జరిగింది. సోమవారం ఉదయం 7 గంటలకే ప్రారంభమైన యాత్రలో అధిక సంఖ్యలో పాల్గొన్న మహిళలు, చిన్నారులు స్వామి వారి రథాన్ని స్వయంగా లాగారు. యాత్ర ముందు భాగంలో పలువురు కళాకారులు ప్రదర్శించిన కోలాటాలు, చెక్కభజనలు అలరించాయి. స్థానిక వడ్రంగి అసోసియేషన్ ఆధ్వర్యంలో నాలుగు రోడ్ల కూడలి, పంచాయతీ కార్యాలయం కూడలిలో అన్నదానం, ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం ఇంటింటా వెలిగిన శ్రీరామ దీపాలు దీపావళి పండుగను తలపించింది. ఆర్‌ఎస్‌ఎస్, సేవా భారతి ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వీహెచ్‌పీ, ఆర్యవైశ్య సంఘం, ఉపాధ్యాయ సంఘ నేతలు పాల్గొన్నారు.

గుర్రంకొండలో: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని గుర్రంకొండలో రామనామంతో మారు మ్రోగాయి. ఇందులో భాగంగా ఆలయాల వద్ద రామకోటి భజనలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు అన్నదానం చేశారు.

కలకడలో: మండలంలోని నడిమిచెర్ల, తెట్టు, కోన, సింగనొడ్డుపల్లె, గువ్వలవారిపల్లెతో పాటు వాడ వాడలా శ్రీరామునికి ప్రత్యేక పూజలను చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

వాల్మీకిపురంలో: అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం వాల్మీకిపురం క్షేత్రం శ్రీరామ నామ స్మరణలతో మర్మోగి పోయింది. అనంతరం పొలిమేర ఆలయం నుంచి భారీగా శ్రీరామ భక్తులు స్కూటర్ ర్యాలీ చేపట్టి జై శ్రీరామ్ నామ సర్మరణలతో హోరెత్తించారు. ఈసందర్భంగా పట్టణంలోని పలుచోట్ల భక్తులకు పానకం, అన్నదానాలు చేపట్టారు. స్థానిక పట్టాభిరామాలయంలో పూజలు నిర్వహిచారు.

నిమ్మనపల్లిలో: అగ్రహారంలోని శ్రీరాలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు చేపట్టారు. అనంతరం పిల్లనగ్రోవి, చెక్క భజనలు వంటి కార్యక్రమాలతో పాటు ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

రామసముద్రంలో: మండలంలోని రామాలయాలు రామ నామస్మరణతో మార్మోగాయి. పలు ఆలయాల్లో సీతారాముల కల్యాణం నిర్వహించారు. స్థానిక చెక్‌పోస్టులోని వాల్మీకి విగ్రహానికి మండల వాల్మీకి సంఘ నాయకులు పూజలు చేసి, అభిషేకాలు చేశారు. చెంబకూరులో కల్యాణం నిర్వహించారు.

ములకలచెరువులో: ములకలచెరువు, గూడుపల్లె, వేపూరికోట, బురకాయలకోట, దేవళచెరువు, మద్దినాయనిపల్లె, సోంపల్లె తదితర గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. శారదా పాఠశాల విద్యార్థులు జై శ్రీరామ్ ఆకారంలో నిలబడ్డారు.


కలికిరిలో: అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా కలికిరిలో సోమవారం రాముల వారి శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. విశ్వ హిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి చింతపర్తి మహేష్ ఆధ్వర్యంలో ఈ శోభాయాత్ర జరిగింది. కాగా మండలంలోని రామాలయాలయాల్లో పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

బి.కొత్తకోటలో: పట్టణంలోని పట్టాభిరామ స్వామి ఆలయం, గుంతావారిపల్లె రామాలయంలో కల్యాణోత్సవం కనులపండుగగా జరిగింది. బి.కొత్తకోట జ్యోతి బస్టాండులో మహావిష్ణుసేన అద్వర్యంలో అన్న సంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ మనోహర్, తహసీల్దార్ రఫిక్ అహ్మద్, ఎంఈవో రెడ్డిశేఖర్, చింతల కిరణ్, రాంకీరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో: మండలంలోని పీటీఎం, కందుకూరు, రంగసముద్రం, విసన కర్రవాండ్లపల్లె, మల్లెల, పులికల్లు, రాపూరి వాండ్లపల్లె, నాగన్నకోట, శ్రీనివాసరాయు నిపల్లె, మడుమూరులలోని శ్రీరాముల ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీనివాసరాయునిపల్లెలో బీజేపీ యువ నాయకుడు రమేష్ ఆధ్వర్యంలో యువత పెద్ద ఎత్తున జైశ్రీరాం అంటూ బైక్ ర్యాలీ నిర్వహించారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

తంబళ్లపల్లె, జనవరి 22: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రముఖ పారిశ్రామికవేత్త, టీడీపీ నియోజకవర్గ నాయకుడు దాసరిపల్లి జయచంద్రారెడ్డి అన్నారు. సోమవారం రాజంపేట టీడీపీ ఎంపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం, టీడీపీ, జనసేన నాయకులతో కలసి మండలంలోని పలు ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తొలుత బురుజుపల్లెలో రామాలయం భూమి పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బురుజుపల్లె రామాలయ నిర్మాణానికి తన వంతు ఆర్థిక సహాయం అందిస్తానన్నారు.ఎద్దులవారికోటలో లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ సాయినాథ్, టీడీపీ నాయకులు సుబ్రమణ్యం, ఎ శివ, మధుసూధన్ పాల్గొన్నారు.





రా.. కదలిరా..ను జయప్రదం చేయండి

పెద్దమండ్యం, జనవరి 22: టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేపట్టిన రా.. కదలిరా.. తెలుగుదేశం పిలుస్తోంది కార్యక్రమాన్ని విజవంతం చేయాలని రాజంపేట పార్లమెంటు టీడీపీ నాయకుడు బాల సుబ్రమణ్యం పిలుపునిచ్చారు. పెద్దమండ్యం మండలంలో సోమవారం ఆయన పర్యటించి టీడీపీ నాయకులతో మాట్లాడారు. కార్యక్రమంలో మస్తాన్‌ఖాన్, రఘునాథ, సోమేశేఖర్‌రెడ్డి,చలపతినాయుడు, సురేష్, శ్రీనివాసనాయుడు, సుబ్బయ్య ఉన్నారు.

అంగన్వాడీల నిర్బంధం దారుణం

మదనపల్లె అర్బన్, జనవరి 22: అంగన్వా డీలపై నిర్బంధం నిరసిస్తూ సోమవారం స్థానిక బెంగళూరు బస్టాండ్‌లో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భం గా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రామకృష్ణారెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ మాట్లాడుతూ అంగాన్వాడీలు తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని చట్టబద్ధంగా నిరసనలు చేస్తుంటే వారిని ప్రభుత్వం పోలీసులతో చట్టవ్యతిరేకంగా నిర్బంధనలు, అరెస్టులు చేస్తున్నారని ఆరోపించారు. విజయవాడకు బయలుదేరిన వారిని అక్రమ అరె స్టులు చేశారన్నారు. దేశంలో మహిళా శక్తిమించిన శక్తి లేదన్నారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ములకలచెరువు, జనవరి 22: మండలంలోని కనుగొండవారిపల్లెకు చెందిన నల్లేరు చలపతి ఇంటి వరండాలో తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకు న్నాడు. ఎస్‌ఐ గాయత్రి ఘటనా స్థలానికి చేరుకుని వ్యక్తి ఆత్మహత్యకు గల కారణాలను విచారించారు. భార్య రత్నమ్మ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేశారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

ములకలచెరువు, జనవరి 22: బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గాయత్రి తెలిపారు. ములకలచెరువుకు చెందిన ఓ బాలిక బి.కొత్తకోటలోని ఓ ప్రైవేటు పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. సంక్రాంతి సెలవుల నేపథ్యంలో ఇంటికి వచ్చి ఆదివారం సాయంత్రం నుంచి కన్పించకుండా పోయిందని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

ఎరువులను అధిక ధరలకు విక్రయించొద్దు

నిమ్మనపల్లి, జనవరి 22: రైతులకు ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్సులను రద్దు చేస్తామని ఏవో మురళి మోహన్, మదనపల్లి భూసంరక్షణ విభాగం ఏవో క్రిష్ణవేణి పేర్కొన్నారు. ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఫిర్యాదులు రావడంతో సోమవారం ఎరువు దుకాణాలకు తనిఖీలు చేపట్టారు.

నేడు ములకలచెరువులో లోకేశ్ జన్మదిన వేడుకలు

- తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత జయచంద్రారెడ్డి



ములకలచెరువు, జనవరి 22: ములకలచెరువులో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, యువనేత నారా లోకేశ్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహిస్తామని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ యువనేత దాసరిపల్లె జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. ములకలచెరువులోని ఆయన స్వగృహంలో సోమవారం ఆయన విలే కరుల సమావేశంలో మాట్లాడుతూ టీడీపీ యువనేత నారా లోకేశ్ ప్రజలు, యువకుల సమస్యలపై గళమెత్తి పట్టిన యువగళం పాదయాత్ర రికార్డులు తిరగరాసిందన్నారు. యువనేత నారా లోకేశ్ జన్మదిన వేడుకల సందర్భంగా మంగళవా రం ములకలచెరువులో పలు కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులందరూ తప్పక హాజరుకావాలని సూచించారు.

వైద్యులపై దాడులు చేస్తే నష్టపోయేది ప్రజలే..

పీలేరు, జనవరి 22: క్షణికావేశం, మద్యం ప్రభావంతో వైద్యులపైన, ఆసుపత్రులపైన దాడులు చేస్తే నష్టపోయేది సామాన్య ప్రజలేనని విషయం అందరూ గుర్తించాలని పీలేరు అర్బన్ సీఐ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఆసుపత్రుల్లో లభించే వివిధ సేవలు, వచ్చే రోగులకు అందించే చికిత్సపై పీలేరు ఐఎంఏ శాఖ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ తాము ఆశించినంత వేగంగా తమ వారు కోలుకోవడం లేదన్న ఆత్రుతతో చాలా మంది రోగుల సహాయకులు వైద్యులపై దాడులు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. వైద్యులపై దాడులు చేసే వారిపై నాన్-బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేయవచ్చన్నారు. ఐఎంఏ పీలేరు శాఖ అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ చికిత్స అందించే వైద్యుడిపై ఒత్తిడి చేయడం, దాడులకు పాల్పడడం చేస్తే రోగికే నష్టమన్నారు సీనియర్ వైద్యుడు రాజాసాహెబ్ సీఐ ఐఎంఏ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

